Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 316 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 డిసెంబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## తగ్గనున్న వంట నూనెల ధరలు!

దిల్లీ: వంట నూనెల ధరలను లీటరుకు రూ. 8-12 మేర వెంటనే తగ్గించాలని వంట నూనెల తయారీ సంస్థల అసోసియేషన్లకు కేంద్రం సూచించింది. అంతర్జాతీయ విపణిలో ధరలు నెమ్మదించిన నేపథ్యంలో అందుకనుగుణంగా దేశీయ వంట నూనెల ధరలను తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'కొన్ని కంపెనీలు తమ వంట నూనెల ధరలను తగ్గించలేదు. మిగతా బ్రాండ్ల గరిష్ఠ చిల్లర ధర(ఎంఆర్‌పీ)లతో పోలిస్తే వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఆయా సంస్థలు వెంటనే ధరలు తగ్గించాలని సలహా ఇచ్చామ'ని ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా అధ్యక్షతన జరిగిన పరిశ్రమ ప్రతినిధుల సమావేశం తర్వాత ఆహార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తయారీ, రిఫైనరీ సంస్థలు పంపిణీదార్లకు సరఫరా చేస్తున్న ధరలను కూడా వెంటనే తగ్గిస్తే ధరల తగ్గింపు వెంటనే వినియోగదార్లకు బదిలీ అవుతుందని పేర్కొంది.

# ఎవరికి లాభం!?




## టీడీపీకి లాభమేనా? తెలంగాణ ఫలితాలు ఏపీ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపనున్నాయి?

హైదరాబాద్/ అమరావతి : తెలంగాణలో ప్రభుత్వ మార్పుతో ఇప్పుడు అందరి దృష్టి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై పడింది. టీఎస్ లో కాంగ్రెస్ విజయం ఏపీ పాలిటిక్స్ పై ఎలాంటి ప్రభావం చూపనుంది? తాజా రాజకీయ పరిణామాలు టీడీపీకి లాభం చేకూరుస్తాయా? లేక వైసీపీకి ప్లస్ అవుతాయా? అన్న చర్చ మొదలైంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ గెలిచింది కాబట్టి అది తమకు లాభిస్తుందని టీడీపీ అంచనా వేస్తుంటే.. లాభనష్టాలపై బేరీజు వేసుకుంటున్నారు వైసీపీ నేతలు.

**తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ఏపీ ప్రజలు, నాయకుల ఆసక్తి..** తెలంగాణ, ఏపీ విడిపోయిన పదేళ్లు గడిచినా ఒక రాష్ట్రంలో జరిగే రాజకీయ పరిణామాలు మరో స్టేట్ పై ప్రభావం చూపిస్తుంటాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ పాలిటిక్స్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు ఏపీ నేతలు, ప్రజలు.

చంద్రబాబు అరెస్ట్ ప్రభావం తెలంగాణ ఎన్నికలపై పడుతుందా? ఆ అంశం ఏ పార్టీకి నష్టం కలిగిస్తుందనే చర్చ ఏపీ వ్యాప్తంగా జరిగింది. ఇక్కడ వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులతో ఏపీ నాయకులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. బంధుత్వాలు కూడా ఉన్నాయి. దీంతో తెలంగాణ ఎన్నికలపై ఎక్కువ ఆసక్తి చూపించారు ఏపీ ప్రజలు, రాజకీయ నాయకులు.

**ఆందోళనలో వైసీపీ..? :** సంక్షేమానికి పెద్ద పీట వేసి రాష్ట్రాన్ని ఎంత అభివృద్ధి చేసినా.. ప్రజా వ్యతిరేకతను మాత్రం మూటగట్టుకుంది బీఆర్ఎస్. దీంతో ఈసారి ఎన్నికల ఫలితాలు మొత్తం తారుమరయ్యాయి. అయితే, తెలంగాణ పరిణామాలు ఏపీలో తమకు కొంచెం ఇబ్బందిగా మారతాయని భావిస్తోంది వైసీపీ. ఏపీలో జరిగిన గత ఎన్నికల్లో వైసీపీ విజయానికి బీఆర్ఎస్ సహకరించిందని, ఆ కృతజ్ఞతతో ఈసారి గులాబీ పార్టీ గెలుపు కోసం వైసీపీ సాయం చేసిందన్న ప్రచారమూ జరిగింది.

**టీడీపీకి ఊపిరినిచ్చిన తెలంగాణ ఫలితాలు.!** ఇన్నాళ్లూ బీఆర్ఎస్ తో ఫ్రెండ్లీగా ఉన్న వైసీపీకి తెలంగాణలో కాంగ్రెస్ గెలవడం ఇబ్బందిగా మారింది. ఇదే ఊపుతో కాంగ్రెస్ ఏపీలో కూడా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే.. అది తమకు ఇబ్బందిగా మారుతుందని వైసీపీలో చర్చ మొదలైంది. మరోవైపు ప్రతిపక్ష టీడీపీకి మాత్రం తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఊపిరినిచ్చాయనే చెప్పొచ్చు. కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో అక్కడక్కడా టీడీపీ శ్రేణులు కూడా రోడ్డెక్కాయి. సాక్ష్యాత్తు హైదరాబాద్ లోని రేవంత్ రెడ్డి నివాసంతో పాటు గాంధీభవన్ కు పసుపు జెండాలతో వెళ్లిన కార్యకర్తలు సంబరాల్లో పాల్గొన్నారు. ఒకప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించడంతో వారి ఆనందానికి అవధులు లేవు.

**ఏపీలో టీడీపీకి కాంగ్రెస్ సహకరిస్తుందా? :** తొలి నుంచి రేవంత్ రెడ్డి చంద్రబాబుకి అత్యంత గౌరవం ఇస్తూ వస్తున్నారు. అంతేకాదు ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయకుండా కాంగ్రెస్ కు మద్దతు పలికేలా చేయడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతమయ్యారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు అరెస్ట్ తర్వాత తెలంగాణలో జరిగిన ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతిచ్చింది. అయితే తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏపీలో టీడీపీకి కాంగ్రెస్ సహకరిస్తుందేమో అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు వైసీపీ నేతలు. తెలంగాణలో టీడీపీ కాంగ్రెస్ తో అనైతికంగా కలిసిపోయిందని, ఓట్లు మొత్తం కాంగ్రెస్ కు గంపగుత్తగా వేయించిందని ఆరోపిస్తున్నారు. గాంధీభవన్ లో జరిగిన సంబరాల్లో కాంగ్రెస్ తో పాటు టీడీపీ జెండాలు కనిపించడాన్ని తప్పుపట్టారు వైసీపీ నేతలు.

**ఏపీలో కాంగ్రెస్ తో టీడీపీ పొత్తు? :** ఏపీలో జరగనున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీ చేసేందుకు టీడీపీ సిద్ధమైంది. ఈ సమయంలోనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు కూడా చేస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, తమ మిత్రపక్షంగా ఉన్న జనసేన తెలంగాణలో పోటీ చేసినా పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. అది వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుందనే చర్చ టీడీపీ, బీజేపీ నేతల్లో సాగుతోంది. అయితే సింహాచలంలో పర్యటిస్తున్న చంద్రబాబు.. కాంగ్రెస్ తో పొత్తు విషయంపై మాట్లాడేందుకు నిరాకరించారు.

ఏపీలో రాక్షస పాలన పోవాలని స్వామి వారిని కోరుకున్నట్లు మాత్రం తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ కు టీడీపీ సహకరించిన నేపథ్యంలో ఏపీలో కూడా అలాగే అనధికార వ్యూహాలతో ముందుకు సాగితే విజయం సాధించొచ్చు అన్న ధీమాతో పసుపు పార్టీ ఉంది. మరోవైపు తెలంగాణ ఫలితాలు ఏపీపై ఏ మేరకు ప్రభావం చూపిస్తాయో బేరీజు వేస్తున్న వైసీపీ.. తమ వ్యూహాలకు పదును పెడుతోంది.

# తెలంగాణలో మూడో శాసనసభ ఏర్పాటు





హైదరాబాద్: తెలంగాణలో కొత్త శాసనసభను ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ అయ్యింది. గవర్నర్ తమిళిసైకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ నేతృత్వంలోని బృందం ఈ గెజిట్‌ను అందజేసింది. గెలుపొందిన ఎమ్మెల్యేల జాబితాను కూడా గవర్నర్‌కు సీఈవో వికాస్‌రాజ్ అందజేశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఏర్పాటైంది. మంత్రివర్గ సిఫార్సు మేరకు రెండో శాసనసభను గవర్నర్ తమిళిసై రద్దు చేశారు.

**ముఖ్యమంత్రే తరువాయి..!** ఇక కొత్త ముఖ్యమంత్రికి సంబంధించిన ప్రమాణ స్వీకార ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. ఈసీ బృందం గవర్నర్‌ను కలవడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం కూడా గవర్నర్‌ను కలవనుంది. కాంగ్రెస్ శాసన సభాపక్షనేతగా ఎన్నికైన వారి పేరును గవర్నర్‌కు నివేదించి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరతారు. అనంతరం సీఎల్పీ నేతకు డిజిగ్నేటెడ్ సీఎం హోదా ఇచ్చి ప్రమాణ స్వీకారానికి గవర్నర్ ఆహ్వానిస్తారు.

**మంత్రులకు వాహనాలు సిద్ధం :** మరోవైపు, ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోసం రాజ్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇవాళే ప్రమాణ స్వీకారం ఉండవచ్చన్న సమాచారం నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం కోసం అవసరమైన కుర్చీలు, టెంట్లు, సహా ఇతరత్రా సామగ్రిని ఇప్పటికే తరలించారు. సాధారణ పరిపాలనా శాఖ, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ సహా ఇతర శాఖల అధికారులు అవసరమైన కసరత్తు చేశారు. శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు రాజభవన్‌కు వెళ్లి.. ప్రస్తుతం అసెంబ్లీ రద్దు తీర్మాన ప్రతిని గవర్నర్‌కు అందించారు. కొత్త మంత్రుల కోసం వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. దిల్‌కుష్ అతిథి గృహానికి వాహనాలను సిబ్బంది తీసుకొచ్చారు.

## ఇక ముఖ్యమంత్రే తరువాయి!

**వీడని ఉత్కంఠ :** సీఎల్పీ నాయకుడు ఎవరన్నదానిపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. సీఎల్పీ ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు ఏకగ్రీవంగా ఎమ్మెల్యేలు అప్పగించారు. దీనికి సంబంధించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఏకవాక్య తీర్మానాన్ని భట్టి విక్రమార్క, సీతక్కతోపాటు పలువురు ఎమ్మెల్యేలు బలపరిచారు. రాష్ట్ర నాయకత్వం పంపిన తీర్మానాన్ని అధ్యయనం చేసి అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో అధిష్ఠానం నిర్ణయం కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేచిచూస్తున్నారు. అటు సీఎల్పీ నేత ఎంపికపై అధిష్ఠానంతో చర్చించేందుకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీకి బయలుదేరి వెళ్లారు. అధిష్ఠానం నుంచి ప్రకటన వచ్చాకే గవర్నర్‌ను కాంగ్రెస్ నేతలు కలవనున్నట్లు తెలుస్తోంది. అప్పుడే సీఎం ప్రమాణ స్వీకారంపై స్పష్టత రానుంది.




## ముఖ్యమంత్రి.. మంత్రివర్గంపై కొలిక్కిరాని చర్చలు

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్న తరుణంలో సీఎల్పీ నాయకుడు ఎవరు? అనేదానిపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. ఓ వైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇంకా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో సమావేశమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా సీఎల్పీ ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ ఏక వాక్య తీర్మానం చేశారు. దీనిని భట్టి విక్రమార్క, సీతక్కతోపాటు పలువురు ఎమ్మెల్యేలు బలపరిచారు. రాష్ట్ర నాయకత్వం పంపిన తీర్మానాన్ని అధ్యయనం చేసి అధిష్ఠానం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటి వరకు ముఖ్యమంత్రి ఎవరా? అన్న దానిపై స్పష్టత రాకపోవడంతో ఇవాళ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉండకపోవచ్చని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. సీఎల్పీ నేత ఎంపికపై అధిష్ఠానంతో చర్చించేందుకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీకి బయలుదేరి వెళ్లారు. అధిష్ఠానం నుంచి ప్రకటన వచ్చాకే గవర్నర్‌ను కాంగ్రెస్ నేతలు కలవనున్నట్లు తెలుస్తోంది. అప్పుడే సీఎం ప్రమాణ స్వీకారంపై స్పష్టత రానుంది. అధిష్ఠానం నిర్ణయం కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేచిచూస్తున్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోసం రాజ్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇవాళే ప్రమాణ స్వీకారం ఉండవచ్చన్న సమాచారం నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం కోసం అవసరమైన కుర్చీలు, టెంట్లు, సహా ఇతరత్రా సామగ్రిని ఇప్పటికే తరలించారు. సాధారణ పరిపాలనా శాఖ, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ సహా ఇతర శాఖల అధికారులు అవసరమైన కసరత్తు చేశారు.




## ఓటమి తర్వాత కేసీఆర్ తొలిసారి ఇలా.. ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత తొలిసారి స్పందించారు. సోమవారం సాయంత్రం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌజ్‌లో గెలిచిన ఎమ్మెల్యేతో ఆయన భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. వచ్చే నెల 16వ తేదీ దాకా మన ప్రభుత్వం కొనసాగేందుకు అవకాశం ఉంది(తెలంగాణ అసెంబ్లీ కాలపరిమితి గడువు జనవరి 16వ తేదీ దాకా ఉంది). కానీ, ప్రజల తీర్పుతో హుందాగా తప్పుకున్నాం. కొత్త ప్రభుత్వానికి సహకరిద్దాం.. ఏం జరగుతుందో చూద్దాం" అని అన్నట్లు తెలుస్తోంది. అలాగే.. త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ మీటింగ్ జరుపుదాం. ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేద్దాం. అదే మీటింగ్‌లో బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేతను ఎన్నుకుందాం అని ఆయన ఎమ్మెల్యేలతో అన్నారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వాళ్లలో నెగ్గిన ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్లు ఉన్నారు.

## ట్రెండింగ్‌లో ఐటీ మినిస్టర్.. కొత్త మంత్రి ఎవరు?

తెలంగాణలో ఎంతో ఆసక్తి రేపిన అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి 65 సీట్లు, బీఆర్ఎస్ పార్టీకి 39 సీట్లు మాత్రమే రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే గత పదేళ్లుగా ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ అద్భుత సేవలు అందించారని.. ఇప్పుడు ఆయన స్థానాన్ని భర్తీ చేసే నాయకుడు ఎవరంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్‌ను మిస్ అవుతామని పలువురు కామెంట్ చేస్తున్నారు. కొందరు బీఆర్ఎస్ అభిమానులు అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా పనిచేయాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. రాజకీయాలను పక్కన పెడితే కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా అద్భుతంగా పనిచేశారని.. ఐటీ కంపెనీలను తేవడంలో, సైబరాబాద్ పరిధిలో అభివృద్ధి విషయంలో కేటీఆర్ పనితీరు ఎంతో మెచ్చుకోదగ్గ విధంగా ఉందని ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ తమకు ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ కావాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్న బీఆర్ఎస్ అభిమానులపై కాంగ్రెస్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త ఐటీ శాఖ మంత్రి ఎవరు అంటూ సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడుస్తోంది. అయితే రేసులో ఎవరున్నారని ఆరా తీస్తే ముగ్గురు, నలుగురు ఉన్నారంటూ చర్చ జరుగుతోంది. కొందరు కాంగ్రెస్ అభిమానులు రేవంత్ రెడ్డి సీఎం అయినా ఆయన దగ్గరే ఐటీ శాఖ ఉంటుందని అంటున్నారు. మరికొందరు మాత్రం దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లేదా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఐటీ శాఖ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే కేటీఆర్ స్థాయిలో మాట్లాడే సత్తా, సైబరాబాద్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఎవరికి ఉన్నాయా అంటూ మాట్లాడుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో ట్విట్టర్ (ఎక్స్)లో ఐటీ మినిస్టర్ అనే పదం ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.




అటు హైదరాబాద్ టీ-హబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా. శాంత ట్వీట్ కూడా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ఓడినప్పటి నుంచి తన ప్రమేయం లేకుండానే కన్నీళ్లు వస్తున్నాయని.. ఐటీలో తెలంగాణను ముందుంచిన కేటీఆర్‌తోనే ఇప్పటికీ వర్క్ చేయాలని ఉందని ఆమె అన్నారు.

# సంపాదకీయం

## కేసీయార్ జాతీయ కలలను చెరిపేసిన ఓటమి !

కేసీయార్ కి జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలని మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్నది ఈ రోజుకు పుట్టిన కోరిక కాదు చాలా కాలంగా ఆయన బుర్రలో నలుగుతోంది. ఆయన తెలంగాణా ఏర్పాటు అయ్యాక ఒక సారి సీఎం అయ్యారు. 2018లో రెండవసారి గెలిచాక ఆయన తన చూపు జాతీయ రాజకీయాల మీద పెట్టారు. రెండవసారి కేసీయార్ గెలిచిన వెంటనే మూడవ ఫ్రంట్ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. అందులో కాంగ్రెస్ బీజేపీ ఉండకూడదని కూడా భావించారు. దేశంలోని సీనియర్ నాయకులను విపక్షలను కేసీయార్ కలిశారు. ఆ కోరిక ఇంకా ఎక్కువగా ఉండడంతోనే ఆయన టీయారెస్ పార్టీని కాస్తా బీయారెస్ గా మార్చేశారు. అలా 2022 విజయదశమి వేళ పార్టీ పేరు మార్చి ఇక జాతీయ పార్టీ అయింది అని కూడా ప్రకటించేశారు. అయితే మూడవ ఫ్రంట్ అని హడావుడి చేసినా లేక బీయారెస్ అని కేసీయార్ బిగ్ సౌండ్ చేసినా అనుకున్న స్పందన అయితే రాలేదు అనే చెప్పాలి. జాతీయ స్థాయిలో కీలక నేతలు అంతా కూడా అయితే బీజేపీ లేకపోతే కాంగ్రెస్ నాయకత్వంలోని కూటములలో చేరిపోయారు. ఆ విధంగా కేసీయార్ జాతీయ ప్రయత్నాలు మాత్రం తగిన ఫలితం అయితే దక్కలేదు. అంతవరకూ ఎందుకు పక్కన ఉన్న కర్నాణక మాజీ సీఎం కుమారస్వామి బీయారెస్ ప్రకటన టైంలో వచ్చిన వారు ఇపుడు చూస్తే బీజేపీతో పొత్తులో ఉన్నారు. ఇక కేసీయార్ నేల విడిచి సాము చేశారు అన్న విమర్శలు వచ్చాయి. ఆయన దేశంలోని ఇతర రాష్ట్రాలకు తిరిగి జాతీయ స్థాయిలో బీయారెస్ ని బలీయమైన శక్తిగా మలచాలని చూశారు. కానీ తెలంగాణాలో బీయారెస్ కి వస్తున్న వ్యతిరేకతను గుర్తించలేకపోయారు. అదే టైం లో దానికి తగిన సమయంలో చికిత్స కూడా చేయలేకపోయారు. ప్రత్యర్ధి పార్టీల బలాన్ని తక్కువ అంచనా వేసుకోవడం, తాము తప్ప ఎవరు గెలిచేది అంటూ ధీమా గా ఉండడంతోనే ఈ ఫలితాలు వచ్చాయని అంటున్నారు. ఇక బీజేపీకి బీయారెస్ బీ టీం అంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారానికి కూడా మంచి స్పందన లభించింది అని అంటున్నారు. ఇంకో వైపు కేసీయార్ కుమార్తె కవిత విషయంలో వచ్చిన లిక్కర్ కుంభకోణం ఆరోపణలలో ఆమెను అరెస్ట్ చేయకుండా బీజేపీ కాపాడింది అన్నది కూడా బలంగా జనంలోకి పోయింది. దాన్ని కాంగ్రెస్ కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకొచ్చింది. మోడీ అయితే ఎన్డీయేలో కేసీయార్ చేరుతానని అన్నారని తామే దూరం పెట్టామని కూడా చెప్పడంతో ఆ ఆరోపణలకు మరింత ఊతం ఇచ్చేలా కాంగ్రెస్ ప్రచారం చేసుకుంది. ఇక కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిన తరువాత లభించిన బూస్ట్ తోనే తెలంగాణాను కూడా గెలుచుకుంది. ఆరు నెలల క్రితం వరకూ ఎలాంటి హడావుడి లేదు. ఇదంతా ఒక మ్యాజిక్ గా సాగిపోయింది. దీంతో కేసీయార్ రెండు సీట్లలో పోటీ చేస్తే గజ్వేల్ లో విజయం వైపున ఉన్నారు. కామారెడ్డిలో మాత్రం ఆయన ఓటమి బాటన ప్రయాణిరు. ఈ నేపధ్యంలో ఒక మాజీ ముఖ్యమంత్రిగా కేసీయార్ మిగిలిపోవడం అంటే రాజకీయ విషాదమే అంటున్నారు.

# తమ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులే గెలుపు కారణం అంటున్న స్థానిక నేతలు



శామీర్పేట (గరుడ వార్త) : మేడ్చల్ ఎమ్మెల్యే గా మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే గా మర్రి రాజశేఖర్ రెడ్డి లు ఘన విజయం సాధించిన సందర్భంగా శామీర్ పేట్ నుండి పెద్ద ఎత్తున నాయకులు ఎమ్మెల్యే నివాసమైన బోయిన్ పల్లి చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు . కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి బిఆర్ఎస్ జిల్లా నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్, ఉప సర్పంచ్ నర్లరమేష్ యాదవ్ లు శాలువా కప్పి, బోకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు మాట్లాడుతు... ప్రజల సేవ చేసే మేడ్చల్ మల్లారెడ్డి కి, మల్కాజ్ గిరి లో మర్రి రాజశేఖర్ రెడ్డి లను గెలిపించుకున్నారని అన్నారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి బిఆర్ఎస్ జిల్లా నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ ఉప సర్పంచ్ నర్లరమేష్ యాదవ్ ల తో పాటు నాయకులు దండుగుల మైసయ్య, షేక్ చాంద్ పాషా, వంగ వెంకట్ రెడ్డి, వంగ నర్సింహ రెడ్డి,వార్డు సభ్యులు సత్యనారాయణ,వజ్జల మురళి, నవీన్ ముధిరాజ్, రవిందర్,దూడల శ్రీకాంత్ గౌడ్,ఉప్పలయ్య ,వాసు ,గొలుసుల విష్ణు, బత్తిని చందర్ గౌడ్, వి శేఖర్, సుధాకర్, గాజుల సత్యం పాల్గొన్నారు.

## అయ్యప్ప 18వ మహా పడి పూజకు ఆహ్వానం

కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను మాలధారణ గావించిన భక్తులు ఎంతో నియమ నిష్టలతో పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 10న యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేని పల్లి గ్రామంలోని దుర్గమ్మ ఆలయం వద్ద 18వ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. కేరళ గురుస్వామి మోహన్ దాస్ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు నరేళ్ల పల్లి లక్ష్మయ్య శర్మ, హరిబాబులు కలసి ఈ మహా పడి పూజ కార్యక్రమం చేయనున్నట్లు గురు స్వాములు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి, కందడి మహిపాల్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి, కేశవపూర్, మూడు చింతల పల్లి గ్రామాల అయ్యప్ప దీక్ష స్వాములను ఆహ్వానించినట్లు వారు వెల్లడించారు. పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.




నైరుతి బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన మిగ్‌జాం తుపాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. విశాఖ, గోదావరి జిల్లాలు, బాపట్ల, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. వరదనీటితో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతు న్నారు. తుపాను కారణంగా బాపట్ల మండలం సూర్యలంక అడవి పల్లెపాలెం తీరంలో సముద్రం కల్లోలంగా మారింది. సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు పడుతున్నాయి. గోవర్ధనపురం, సీఎల్ఎన్‌పల్లి వద్ద పాముల కాలువ, కాదూరు వద్ద సున్నపు కాలువ, పాండూరు వద్ద రాళ్లవాగు పొంగి పొర్లుతున్నాయి. వరద ఉద్ధృతికి ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించాయి. చెరువులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. వరదయ్యపాలెం చెరువుకు గండి పడే ప్రమాదం ఉండటంతో అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. తిరుమలలోనూ తుపాను ప్రభావం ఉంది. ఇప్పటికే కురుస్తున్న భారీ వర్షాలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చలితో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. శ్రీకాళహస్తి సమీపంలోని స్వర్ణముఖి ఆనకట్ట వద్ద 2,004 అడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగుతుంది. వర్షాల కారణంగా నదీ ప్రవాహం మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

శ్రీకాళహస్తి పట్టణంలోని లంక మిట్టకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. దీంతో అవసరమైన వారిని ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తుపాను ప్రభావంతో నెల్లూరు నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 13 పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు 250 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. తుపాను కారణంగా ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. పాఠశాలలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తుపాను ప్రభావం కనిపిస్తోంది. తీర ప్రాంతమైన సూళ్లూరుపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతోంది. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశారు.



## తుఫాను ప్రభావిత జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

అమరావతి: “మిచాంగ్” తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. రేపు తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టరేట్లను ఏర్పాటు చేసింది.

అలాగే తుఫాను ప్రభావిత జిల్లాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. బాపట్ల – కాటమనేని భాస్కర్, బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ – జయలక్ష్మి, తూర్పుగోదావరి – వివేక్ యాదవ్, కాకినాడ – యువరాజ్. ప్రకాశం – ప్రద్యుమ్న, ఎస్పీఎస్ నెల్లూరు – హరికిరణ్, తిరుపతి – జె.శ్యామలరావు, వెస్ట్‌గోదావరి – కన్నబాబు.

# బురద బాధలు..!

ఖమ్మం : నగరంలోని ఆరోడివిజనలో రస్తోగినగర్, ప్రశాంతి నగర్, ఖానాపురం కాలనీలున్నాయి. ఆ డివిజనకు సంబంధించి గడిచిన ఐదేళ్లలో రూ. 8.38కోట్లు అభివృద్ధి పనుల కోసం కేటాయించారు. కానీ ఆ డివిజనలో చిన్నపాటి వర్షం పడితే చాలు నడవడానికి కూడా వీల్లేనంత చిత్తడిగా మారుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో ఇటీవల ప్రశాంతినగర్ వెనుకభాగంలో స్థానికులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. మూడో డివిజనలో... బల్లేపల్లి, ఎస్సీ కాలనీ, జయనగర్‌కాలనీలున్నాయి. ఈ మూడు ప్రాంతాలు ఏర్పడి ఇరవైళ్లు దాటింది. గడిచిన ఐదేళ్లలో ఆ డివిజనలో అభివృద్ధి పనులకుగాను కార్పొరేషన్‌లోని ఎల్ఆర్ఎస్, సీఎం హామీ నిధులు, పురపాలక సాధారణ నిధుల నుంచి రూ.6.35కోట్లు ఖర్చు చేశారు. కానీ జయనగర్ కాలనీలో 17వ లైను నుంచి మొదలుకుని ఎక్కడా అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరగలేదు. 18వ డివిజనలో బొమ్మ పెట్రోల్ పంప్ ప్రాంతం, శ్రీరాంనగర్ కొంత, శ్రీరాంహిల్స్ ఉన్నాయి. ఆ ప్రాంతానికి సంబంధించి గత ఐదేళ్లలో అభివృద్ధి పనుల కోసం కేవలం రూ.కోటి మాత్రమే ఖర్చు చేశారు. దీంతో శ్రీరాంనగర్‌లోని పలు అంతర్గత రహదారులు ప్రస్తుతం కురుస్తున్న అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారి వాహనాలపై వెళ్తున్న వారికి ప్రమాదాలు జరిగేలా తయారైంది. 59డివిజనలోని దానవాయిగూడేనికి సంబంధించి రూ.3.60కోట్లు ఖర్చు చేశారు. కానీ ఆ డివిజనలోనూ చాలా రహదారులు వర్షాలకు గుంతలమయంగా మారాయి.రెండో డివిజనలోని ఎస్ఎఫఎస్ స్కూల్, పాండురంగాపురం ప్రాంతాలకు సంబంధించి రూ.5.20 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఆడివిజనలోని మసీదు రోడ్డు నుంచి ఒకటో డివిజన్‌లోని కైకొండాయిగూడెం వెళ్లే దారికి కలిసే ప్రధాన రోడ్డును పట్టించుకోలేదు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం పడితే వాహనాలు జారిపడే పరిస్థితి ఉంది ఖమ్మం నగరం.. ఎంతో అభివృద్ధి చెందుతూ ఉంది. నగరం నాలుగువైపులా ఉన్న ప్రధాన రహదారులన్నీ విస్తరణ జరిగింది. కానీ కాలనీ నుంచి ప్రధాన రహదారులనుకలిపే వాటి అంతర్గత రహదారులను మాత్రం పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. చాలా డివిజన్లలో కాలనీలు ఏర్పాటయి పదుల ఏళ్లు దాటుతున్నా ఆయా ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు మాత్రం అభివృద్ధికి నోచుకోని పరిస్థితులు ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడితేచాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి.

ఐదేళ్లలో రూ.200కోట్లకుపైగా ఖర్చు..కార్పోరేషనలో 2017 నుంచి ఇప్పటి వరకు రూ.209.80కోట్లను ఖర్చు చేశారు. 60డివిజన్లలో చేపట్టిన పనులకు ఎల్ఆర్ఎస్ నిధులు రూ.61.80కోట్లు, సీఎం హామీ నిధులు రూ.74కోట్లు, పురపాలక సాధారణ నిధుల నుంచి రూ.63 కోట్లు, ఎస్ఎఫసీ నిధులు రూ.11కోట్లను ఖర్చు చేశారు. అయితే ఈ నిధుల్లో అత్యధికంగా రోడ్ల విస్తరణ, విస్తరించిన రోడ్డు పక్కన డ్రెయినేజీల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ లాంటి పనులకే వినియోగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అంతపెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసినా అంతర్గత సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదన్న వాదన వినిపిస్తోంది. ఈ సమస్యలపై ప్రజలు స్థానిక నేతలకు మొరపెట్టుకుంటుంటే.. వారు ‘తర్వాత చుద్దాం’ అంటూ కాలం వెళ్లదీస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడం, చిన్నపాటి వర్షాలకే రోడ్లు బురదమయంగా మారుతుండటంతో అభివృద్ధి, అంతర్గత సమస్యలపై చర్చ జరుగుతోంది. డివిజన్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా సమస్యలు ఎక్కడివక్కడే కనిపిస్తుండటంతో నిధులన్నీ ఏమయ్యాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇళ్లల్లోనుంచి కాలు బయటపెట్టాలంటే భయపడేంతగా అంతర్గత రహదారులు ధ్వంసమయ్యాయని పేర్కొంటున్నారు.

గ్రీవెన్సలో మొరపెట్టుకున్నా.. తమ డివిజన్లలోని అంతర్గత రహదారులు, ఇతర సమస్యలపై ప్రజలు పలుమార్లు గ్రీవెన్సలో దరఖాస్తులు చేస్తున్నా అధికారులు వాటిని పక్కన పెట్టేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను డివిజన్లలోని సంబంధిత అధికారులకు బదిలీ చేసిన అనంతరం అధికారులు ‘ఫైనాన్షియల్ ఇంప్లిమెంటేషన’ అంటూ దరఖాస్తును చెత్తబుట్టలో పడేస్తున్నారని తెలుస్తోంది. అంతేకాదు కార్పొరేషన్‌లో కొందరు ఇష్టారాజ్యంతోనే పనులు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఫలితంగానే డివిజన్లలో అంతర్గత సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక అధికార పార్టీకి చెందిన నేతల డివిజన్లలోనే పనులు చేస్తున్నారని, తమ డివిజన్లలోని సమస్యలను, వారు పంపిన ప్రతిపాదనలు కనీసం పట్టించుకోవడంలేదంటూ ఇటీవల కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర కార్పొరేటర్లు కమిషనర్‌కు వినతిపత్రమిచ్చారు. స్థానికంగా సదరు కార్పొరేటర్లపై ఒత్తిడి పెరుగుతున్న సమయంలో చేసేదేంలేక వారు నిరసనలకు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తోంది.

## ప్రగతిరథ చక్రం కుదేలు

ఖమ్మం : ప్రగతి చక్రం కుదేలవుతోంది. లాభాలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ఖమ్మం రీజియన ఆర్టీసీ అక్షరాలా రూ.7కోట్ల నష్టం ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్ని ప్రజా ఆకర్షక విధానాలు అవలంబించినా లాభాల్లోకి రాలేకపోతోంది. ఎన్నో కొత్త సబ్సిడీలు ఇస్తున్నా ప్రయాణికులు వాటిని వినియోగించుకోవడంలో వెనుకడగు వేస్తున్నారు. శుభకార్యాలకు, పర్యాటక ప్రాంతాలకు బస్సును బుక్‌చేసుకంటే పలు రాయితీలు ప్రకటించింది. అయినా ప్రజలనుంచి అంతగా స్పందన లేదని తెలుస్తోంది. దీనికితోడు ఇటీవల పడిన భారీవర్షాలు, వచ్చిన వరదలకు రీజియన పరిధిలో ఎక్కువశాతం బస్సులను రద్దుచేశారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,624 మంది సిబ్బంది ఉండగా వారిలో 1,046 మంది కండక్టర్లు, 1,028 మంది డ్రైవర్లు, 122మంది మెకానిక్‌లు, 420 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. ఆ సిబ్బంది జీతాలు సుమారు రూ.5కోట్ల వరకు ఉన్నాయి. రోజుకు రూ.కోటికి చేరువలో ఆదాయం..ఇరుజిల్లాల్లో 547 బస్సులుండగా.. వాటిలో 265 అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఆ అద్దె బస్సులకు తిరిగిన రూట్ల మేరకు అద్దెలను చెల్లిస్తోంది. అలా అద్దె ప్రాతిపదికన నడిచే బస్సుల యజమానులు దాదాపుగా అందరూ రుణాలపై వాహనాలు కొన్నవారే. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బస్సులు తిప్పే పరిస్థితి లేకపోవడంతో ఈఎంఐలు చెల్లించడంకష్టంగా మారిందని పలువురు అద్దె బస్సుల యజమానులు వాపోతున్నారు. ఖమ్మం డిపోలో ఆర్టీసీ 88 బస్సులు, అద్దెవి 72 బస్సులు, మధిరలో 29, 27, సత్తుపల్లిలో 41, 54, భద్రాచలం 55, 39, కొత్తగూడెంలో 37, 36, మణుగూరులో 32ఆర్టీసీ, 36 అద్దె బస్సులున్నాయి. మొత్తం రీజియన పరిధిలో ఆర్టీసీ బస్సులు 282, అద్దె బస్సులు 265 కలిపి 547 బస్సులు ఉన్నాయి. రోజుకు సుమారు లక్షా30వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. చార్జీల పెంపు తర్వాత అన్ని సర్వీసులు కలిపి రోజుకు రూ.96లక్షలకుపైగానే ఆదాయం వస్తుండగా.. నిర్వహణ ఖర్చులు సరిపోవడం లేదు. ఖమ్మం డిపోనకు రోజుకు రూ.26లక్షలు, మధిర రూ.9లక్షలు, సత్తుపల్లి రూ.16లక్షలు, భద్రాచలం రూ.19లక్షలు, కొత్తగూడెం రూ.11లక్షలు, మణుగూరులో రూ.15లక్షల ఆదాయం వస్తోంది. బల్క్ డీజిల్ ధరలు తగ్గిస్తేనే నష్టం పూడుతుందిప్రభులత, ఖమ్మం రీజనల్ మేనేజర్ ప్రస్తుతం ఆర్టీసీ బస్సులకు సంబంధించిన బల్క్ డీజిల్ ధరలను కంపెనీలు విపరీతంగా పెంచాయి. బల్క్ డీజిల్ ధరలను తగ్గిస్తే తప్పా ఆర్టీసీ నష్టం తగ్గే సూచనలు కనబడడంలేదు.

# మేథ్స్‌లో మనోళ్లు తగ్గుతున్నారు

హైదరాబాద్: వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఇటీవల కాలంలో గణితంలో గాడితప్పుతున్నట్లు జాతీయ విద్యా, పరిశోధన మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా తెలంగాణ విద్యార్థుల్లో 49 శాతం మంది కనీస సామర్థ్యాలు చూపలేకపోతున్నారని సర్వే పేర్కొంది. ప్రధాన రాష్ట్రాల్లో విద్యార్థుల మాతృ భాషల అభ్యసనతోపాటు గణితం సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఎన్‌సీఈఆర్‌టీ సూచించింది. దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థుల సామర్థ్యాలను మదించి ఎన్‌సీఈఆర్‌టీ ఈ నివేదిక రూపొందించింది. ఇందులో తెలంగాణలో 180 స్కూళ్లకు చెందిన 1,500 మందికిపైగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించింది.

బేసిక్స్ కూడా అంతంతే.. ఈ అధ్యయనం నివేదిక ప్రకారం... ప్రాథమిక విద్య చదువుతున్న వారిలో చాలా మంది బేసిక్స్‌లోనూ బాగా వెనుకబడ్డారు. టెన్త్ విద్యార్థుల్లో రెండంకెల లెక్కలకూ తడుముకొనే పరిస్థితి ఉంది. కరోనా కాలంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలకు అతుక్కుపోవడం, స్వయం సామర్థ్యం పెంపు దెబ్బతినడానికి కారణమైంది. ఏ చిన్న లెక్కకైనా క్యాలిక్యులేటర్, ఆన్‌లైన్‌లో వెతుక్కొనే పద్ధతికి అలవాటయ్యారు.

8%--%10 తరగతుల విద్యార్థులు కాగితంపై లెక్కజేయడానికి అవసరమైన దానికన్నా రెండింతల సమయం తీసుకుంటున్నారు. మాతృభాషలో చదవలేని వారు 19 శాతం ఉన్నట్లు తేలింది. పట్టుమని పది పదాలు తప్పులు లేకుండా చదవగలిగిన వారు 6 శాతం, 20 పదాలు చదివిన విద్యార్థులు 13 శాతం ఉన్నారు. ఇక 70 పదాలు తప్పులు లేకుండా చదవగలిగే వాళ్లు 12 శాతమే ఉన్నట్లు అధ్యయనంలో తేలింది.

ముఖ్యంగా మూడో తరగతి వరకూ కనీసం అంకెలు కూడా గుర్తించలేని పరిస్థితి కనిపిస్తోంది. రెండంకెల కూడికలు, తీసివేతలు కూడా చేయలేని స్థితిలో 43 శాతం మంది మూడో తరగతిలో ఉన్నారని సర్వేలో గుర్తించారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎన్‌సీఈఆర్‌టీ కేంద్రానికి సూచించింది. ఈ నేపథ్యంలో ఏయే రాష్ట్రాలు ఎలాంటి చర్యలు అనుసరిస్తాయనే విషయమై స్పష్టత ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ అన్ని రాష్ట్రాలనూ కోరింది.

టీచర్ల కొరతా కారణమే

ప్రభుత్వ పాఠశాలల్లో 18 సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధనకన్నా బోధనేతర పనులు అప్పగిస్తున్నారు. పైగా ఈ పనులకే కచ్చితత్వం ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేథ్స్ వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులు సరైన ప్రతిభ చూపే అవకాశం లేదు. దీనిపై విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. %--% పి.రాజాభాను చంద్రప్రకాశ్, అధ్యక్షుడు, రాష్ట్ర గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం

# అతివల అండ.. ఉంటేనే దండ..

నిర్మల్: జిల్లాలోని మూడు నియోజవర్గాల్లో జరిగిన ఎన్నికల సమరంలో ఓటరు గెలిచాడు. ఓటరు చైతన్యంపై స్వీప్ కార్యక్రమం ద్వారా అధికార యంత్రాంగం చేపట్టిన అవగాహన, ప్రచార కార్యక్రమాలు పోలింగ్ సరళి స్పష్టం చేస్తోంది. చలిని సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి రాత్రి వరకు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో కనిపించారు.

మరోసారి.. మహిళా శక్తి..

ఓటర్ల గణాంకాలు పరిశీలిస్తే.. జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోనూ పురుషులకు దీటుగా మహిళలు సగానికిపైగా ఉండి ముందు వరుసలో నిలబడ్డారు. ఇన్నాళ్లు సాగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఏ సభ చూసినా మహిళలే హాజరై వాటిని విజయవంతం చేశారు. పార్టీల అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీల్లో తామున్నామంటూ ముందువరుసలో ఉండి నడిపించారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో శాసనసభకు ప్రజాప్రతినిధులను పంపించడంలో నారీమణులే కీలకపాత్ర వహించారు. నిర్ణయాత్మక శక్తి ఉందని మరోసారి ఈ ఎన్నికల్లో నిరూపించారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ మహిళలే అత్యధికంగా ఓట్లు వేసి వారెవ్వా.. అనిపించారు. మూడు నియోజకవర్గాల్లోనూ పురుషుల కంటే 31,138 మంది మహిళలు ఎక్కువగా ఓటు వేశారు. నిర్మల్ నియోజకవర్గంలో అధికంగా మహిళలే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం ఓట్లు 2,53,309 ఉండగా.. 1,95,757 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 89,143 ఓట్లు పురుషులుగా వేయగా.. 1,06,602 ఓట్లు మహిళలు వేశారు. 17,459 మంది మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ముథోల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,49,554 మంది ఉండగా.. 2,00,984 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో 97,961 మంది పురుషులు ఉండగా.. 1,03,023 మంది మహిళలు ఉన్నారు. 5,062 మంది అతివలు అధికంగా ఓట్లు వేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 2,20,526 మంది ఓటర్లు ఉండగా 1,70,815 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుష ఓటర్లు 81,097 ఉండగా.. మహిళలు 89,714 మంది ఓటు వేశారు. ఇక్కడ 8,617 మంది ఓట్లు ఎక్కువగా వేసి మహిళాశక్తి మరోసారి చాటిచెప్పారు.

'యువత'లోనూ హుషారు

ప్రస్తుతం అందరి నోళ్లలో 'యువ'జపం సాగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా యువత కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోవడమే కాకుండా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా పట్టణ, పెద్ద గ్రామాల్లో వీరి ఆధిపత్యం సుస్పష్టం. ఈ ఎన్నికల్లో 'యువ' ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారనే విషయంలో పార్టీల అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. జిల్లాలో 7,23,329 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 25 శాతం వరకు యువ ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 78.52 శాతం పోలింగ్ నమోదుకాగా.. ఇందులో తమకు 20 శాతం యువత ఓట్లు వేసి ఉంటారని ప్రధాన పార్టీల నేతలు అంచనాలు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు ఉండటంతో పోరు నువ్వా.. నేనా అన్నట్లు సాగటంతో ఈ ఓటర్లపై ఆయా పార్టీల అభ్యర్థులు నమ్మకంతో ఉన్నారు.

ఉత్సాహంగా తరలివచ్చారు..ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చారు. యువత, మహిళలు, వృద్ధులు ఇలా అర్హత ఉన్నవారందరూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ బారులుతీరిన దృశ్యాలే కనిపించాయి. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లోని పలు కేంద్రాల్లో గురువారం రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరగడమే ఇందుకు ఉదాహరణ. అధికార యంత్రాంగం పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లోనూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరుతూ వివిధ రకాలుగా చేసిన ప్రచారం సత్ఫలితాలను ఇచ్చింది.

# బాతాఖానీ.. ఖాతా ఖాళీ



హైదరాబాద్ : హుమాయున్‌నగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి వాట్సాప్ నంబరుకు లింక్ వచ్చింది. క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాకు పాన్‌కార్డు జత చేయకుంటే సేవలు నిలిపివేస్తామంటూ సారాంశం. కంగారుపడిన ఆయన డెబిట్‌కార్డు నెంబరు, ఓటీపీ చెప్పడంతో క్షణాల్లో రూ.1.33 లక్షలు లాగేశారు. లక్డీకపూల్‌లోని వ్యాపారి మొబైల్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశారు. పాన్‌కార్డు నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అప్‌డేట్ చేసుకోవాలని చెప్పడంతో ఆయన ఆన్‌లైన్‌లో వివరాలు నింపారు. బ్యాంకు ఛార్జీల పేరుతో రూ.10 చెల్లించి ఓటీపీ చెప్పారు. రూ.2 లక్షలు పోగొట్టుకున్నారు. సైదాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి ఫోన్ నెంబర్‌కు కస్టమర్‌కేర్ నుంచి ఫోన్ చేశారు. బ్యాంక్ ఖాతా సేవలు నిలిచిపోయాయని పునరుద్ధరించేందుకు బ్యాంకు వివరాలు అడగటంతో ఆయన చెప్పేశారు. ఎనీడెస్క్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించి రూ.3.50లక్షలు కాజేశారు.

సికింద్రాబాద్‌లో ఉంటున్న చిరువ్యాపారికి ఉదయాన్నే ఫోన్‌కాల్ వచ్చింది. క్రెడిట్‌కార్డు పరిమితిని పెంచుతామంటూ లింకు పంపారు. దాన్ని క్లిక్ చేసి అట్నుంచి అడిగిన వివరాలు, ఓటీపీ పంచుకున్నాడు. అంతే రెండు దఫాలుగా రూ.లక్షతో ఇ-కామర్స్ ద్వారా వస్తువులు కొనుగోలు చేశారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. కరోనా అనంతరం డిజిటల్ లావాదేవీలు క్రెడిట్/డెబిట్‌కార్డులు వినియోగాలు తప్పనిసరి కావడంతో మాయగాళ్లు సామాన్యులను హడలెత్తిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్స్ పరిధిలో 10 నెలల వ్యవధిలోనే సుమారు 5వేలకు పైగా సైబర్ కేసులు నమోదైనట్లు అంచనా. వీటిలో కస్టమర్‌కేర్ సెంటర్, ఓటీపీ ద్వారా సొమ్ము పోగొట్టుకున్నవి, పాన్‌కార్డు అప్‌డేట్, పాన్ నంబర్లకు ఖాతా లింక్ చేస్తామంటే నమ్మి మోసపోయిన కేసులు 1500 మందికి పైగా ఉన్నాయి. ఎనీడెస్క్/వ్యూయర్ యాప్‌ల ద్వారా బాధితుల సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లను తమ ఆధీనంలోకి తీసుకుంటారు. బ్యాంకు ఖాతా నెంబరు, ఓటీపీలతో సొమ్మంతా స్వాహా చేస్తుంటారు. బాధితుల్లో విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు, ఐటీ నిపుణులు, గృహిణులు, వ్యాపారులు అధికశాతం ఉంటున్నారు. కొట్టేసిన నగదును నిందితులు క్రిప్టో కరెన్సీగా మార్చి డిజిటల్ హవాలా మార్గంలో విదేశాలకు తరలిస్తున్నారు.

లింకులను క్లిక్ చేయొద్దు

గుర్తుతెలియని వ్యక్తులు/సంస్థల పేరుతో ఫోన్లు, వాట్సాప్‌లకు వచ్చే లింకులను క్లిక్ చేయవద్దు.

ఒక్కసారి పాన్‌కార్డు నంబరు వచ్చాక జీవితకాలం అదే కొనసాగుతుంది. అప్‌డేట్ చేయడం ఉండదు.

బ్యాంకు ఖాతాలతో పాన్‌కార్డు అనుసంధానించాలని ఫోన్ వస్తే సంబంధిత బ్యాంకుకు నేరుగా వెళ్లి అధికారులను సంప్రదించండి.

సైబర్ నేరం బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి. మాయగాళ్ల ఖాతాను స్తంభింపజేసే అవకాశం ఉంటుంది.

కేటుగాళ్లు ఎవరో తెలుసా?

నామమాత్రం చదువులు.. ఆకతాయిగా తిరిగే కుర్రాళ్లు.. ఒంటికి చెమట పట్టకుండా రూ.లక్షలు కొట్టేస్తున్నారు. గతంలో ఝార?ండ్ జాంతారాకే పరిమితమైన వీరు పాన్‌ఇండియాగా విస్తరించారు. బిహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, ఝార?ండ్, రాజస్థాన్‌ల్లో ముఠాలుగా ఏర్పడి దందా సాగిస్తున్నారు. భరత్‌పూర్, పట్నా, బెగుసరాయ్, ధన్‌బాగ్, కోల్‌కతా నుంచి దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. రోజూ ఒక్కొక్కరు సుమారు 200-300 ఫిషింగ్ సందేశాలు, మెయిల్స్ పంపుతుంటారు. లావాదేవీలు నిలిపివేస్తారనే ఆందోళనతో లింకులను క్లిక్ చేసిన వారి బలహీనతను ఆసరా చేసుకొని ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. నిందితుల ఖాతాలను స్తంభింపజేసినా అప్పటికే నగదు వేర్వేరు ఖాతాల్లోకి చేరిపోతుంది.

# వ్యర్థాలతో ముప్పు.. ఏదీ కనువిప్పు!



వరంగల్ : కాలుష్య కారకాలు మానవాళికి ముప్పు తెస్తాయి. గాలి, నీరు, శబ్ద కాలుష్యాలు నియంత్రించకపోతే భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తలెత్తుతాయి. వరంగల్ మహానగరంలో వెలువడే వ్యర్థాలు మడికొండ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. నగరంలో ఏటా వేల సంఖ్యలో వాహనాలు పెరుగుతున్నాయి. ఇలా వాయు కాలుష్యం ద్వారా పరిసర ప్రాంత వాసులు రోగాల బారిన పడుతున్నారు. భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన ప్రజల జ్ఞాపకార్థం జాతీయ కాలుష్య నియంత్రణ దినంగా జరుపుకుంటున్న నేపథ్యంలో కాలుష్య సమస్యలు, నివారణ చర్యలపై అందిస్తున్న ప్రత్యేక కథనం

డంపింగ్ యార్డులో,,

నగరంలో వెలువడే వ్యర్థాలను ప్రతి రోజూ భారీ ఎత్తున మడికొండ వద్ద యార్డులో డంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం 20 లక్షల టన్నులకు పైగా చెత్త గుట్టలను తలపించేలా పేరుకుంది. వాటి మధ్య ఏర్పడే ఒత్తిడి కారణంగా నిత్యం మంటలు, పొగ ఏర్పడుతున్నాయి. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు దహనం కావడంతో వాయు కాలుష్యం సమస్య తీవ్రంగా పెరిగిపోతుంది. ఈ పొగ కాలుష్యం మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, కుమ్మరిగూడెం, ఎల్కుతుర్తి, నర్సింగరావుపల్లె గ్రామాలను చుట్టుముడుతోంది. ఇక్కడ అక్టోబర్ మాసంలో కాలుష్య నమూనాలు సేకరించి పరీక్షించగా వాయు కాలుష్యం 201 (మైక్రో గ్రీన్ పర్ మీటర్ క్యూబ్) శాతం నమోదైనట్లు పీసీబీ అధికారులు తెలిపారు.

దుమ్ము రేగుతూ..

కాకతీయ మెడికల్ కాలేజీ క్రీడా మైదానంలో గత నెల 28న సభ నిర్వహించారు. ఈసందర్భంగా వదిలేసిన వ్యర్థాలను కళాశాల సిబ్బంది తొలగించినా ఇప్పటికీ ప్రజలు వాడిన నీటి పొట్లాలు కుప్పలుగా ఉన్నాయి. సభకు హాజరైన వారికి ప్రత్యేక మూత్రశాలలు ఏర్పాటు చేయకపోవడం వల్ల బహిరంగ మూత్రవిసర్జన చేశారు. దీంతో క్రీడామైదానం దుర్గంధమయమైంది. గుంతల దారిని సిమెంటు డస్ట్‌తో చదును చేసి ఆ రోజు నీరు చల్లించారు. ఇప్పుడా దారిలో వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ములేచి వాయు కాలుష్యం ఏర్పడుతోంది. కేఎంసీ్మలోకి వచ్చే వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చే రోగులు ముక్కులు మూసుకొని రావాల్సి వస్తోంది.

మైదానం దుర్గంధం

ఖిలావరంగల్ కోటలోని మైదానంలో ఇటీవల రెండు పార్టీలు సభలు నిర్వహించాయి. లక్షలాది మంది సభకు వచ్చారు. అక్కడ ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, పార్టీ జెండాలు ఇతర వ్యర్థాలను వదిలేశారు. ఈ మైదానంలోనే క్రికెట్తోపాటు వివిధ క్రీడలు ఆడుతుంటారు. ఉదయం, సాయంత్రం నగరవాసులు వ్యాయామం ఆ మైదానంలోనే చేస్తుంటారు. సభల సందర్భంగా అక్కడ ప్రజలు వదిలేసిన వ్యర్థాలతోపాటు, బహిరంగ మూత్రవిసర్జనతో క్రీడాకారులు, వ్యాయామం చేసుకునే నగరవాసులు తీవ్ర వాయు కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నారు.

గాలి నాణ్యత ఇలా..

గాలిలో కాలుష్య కారకాల సాంద్రతను బట్టి నాణ్యతను నిర్ధారిస్తారు. అక్టోబరు మాసంలో గాలి నాణ్యత సూచిక పరిశీలిస్తే వరంగల్ ప్రాంతంలో 85, హనుమకొండలో 51 (మైక్రో గ్రామ్ పర్ మీటర్ క్యూబ్) శాతం నమోదైంది. 0-50 శాతం ఉంటే సాధారణ ప్రభావం, 50-100 వరకు సున్నితమైన వారికి స్వల్ప ఇబ్బందులు, 101-200 వరకు అస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఇబ్బందులు తలెత్తుతాయి.

తగ్గించడానికి ఉన్న మార్గాలు ..

ఘన వ్యర్థాలను శుద్ధి చేసి నిర్వహించడం ద్వారా, బయోకెమికల్ వ్యర్థాలను సేకరణ, ధ్వంసం చేయడం ద్వారా, పట్టణాల్లో క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడం, అధిక శబ్ద కారకాలను నియంత్రించడం చేయాలి.

కాలుష్య సమస్యలు ఇలా

డంపింగ్ పొగతో ప్రజలు శ్వాసకోస, చర్మవ్యాధుల బారిన పడుతున్నారు.

భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయి.

డంపింగ్ పొగ వల్ల తాటి చెట్లు ఎండిపోయి గీతకార్మికుల ఉపాధి దెబ్బతింటోంది.

చెరువుల్లోని చేప పిల్లలు వాటంతటవే చనిపోతున్నాయి.

డంపింగ్ యార్డు దిగువన మడికొండ పెద్ద చెరువు నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల దిగుబడులు పడిపోయి ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

గాలి, నీరు, నేల, శబ్దం వంటి వివిధ కాలుష్యాలకు కారణమయ్యే, పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం చూపే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. కాలుష్య నివారణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి. దిల్లీలో ఈమధ్య వాహన కాలుష్యం తగ్గించేందుకు వాటి నంబర్ల సరి- బేస్ సంఖ్యల ఆధారంగా రోడ్ల మీదకు వచ్చేలా అమలు చేస్తుండటం సత్ఫలితాలిచ్చింది.

పీసీబీ నామమాత్రంగా పని చేస్తోంది

పుల్లూరు సుధాకర్, పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణుడు, హనుమకొండ

దిల్లీ నగరంలో పంట వ్యర్థాల దహనం వల్ల గాలి కాలుష్యం ఏర్పడుతోంది. వరంగల్ నగరంలో చెత్త కాల్చడం ద్వారా వాయు కాలుష్యానికి కారణం అవుతోంది. పెట్రోలు, డీజిల్ వినియోగంతోనూ కాలుష్యం వెలువడుతోంది. వాయు కాలుష్యం నివారణలో కాలుష్య నియంత్రణ మండలి నామమాత్రంగా పని చేస్తోంది. ప్రజల్లోనూ ఎలాంటి అవగాహన కల్పించడం లేదు.

ప్రత్యామ్నాయం చూడాలి

కె.మల్లేష్, మడికొండ

ఇటీవల ఆధునిక యంత్రాలతో వ్యర్థాల శుద్ధీకరణకు ఆధునిక బయోమైనింగ్ ఏర్పాటు చేసి రెండు మాసాల పాటు నడిపించారు. పొగ తాకిడికి తట్టుకోలేక బయో మైనింగ్ మూసివేశారు. చెత్తను ల్యాండ్ ఫిల్లింగ్ చేయాలి. చెత్తను జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలి.

# చలికాలం జర భద్రం.. ఈ జాగ్రత్తలు మస్టుగా తీసుకోండి

న్యాల్‌కల్ : చలి తీవ్రత పెరగడంతో కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పొగమంచు కురుస్తున్నది. సాయంత్రం నుంచి మొదలుకొని మరునాడు ఉదయం 8గంటల వరకు చలివీస్తుం డడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం చాలామంది వాకింగ్, జాగింగ్ చేస్తున్నారు. చలికాలంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్య నియమాలు పాటించక పోవడంతో జబ్బుల బారినపడతారని నిపుణులు పేర్కొంటున్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారు జబ్బులు వారిని పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పౌష్టికాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

చలికాలంలో చల్లని వాతావరణం వణికిస్తుంది. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ కాలంలో ఆహ్లాదం మాటున జబ్బులు పొంచి ఉంటాయి. ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ ఎక్కువగా చేస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్య నిఫుణులు సూచిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు బయట తిరగకపోవడం మంచిదని, తప్పనిసరైతే తలకు మఫ్లర్, మంకీ టోపీలు, ముఖానికి మాస్కులు ధరంచి బయటకు రావడం మంచిదంటున్నారు. దీంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు బారిన ప్రమాదం ఉంటుందన్నారు. తాగునీటి విషయంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుషిత నీరు తాగితే డయేరియా



వ్యాపించే ప్రమాదకరంగా పరిణమిస్తుందని పేర్కొంటున్నారు.గాలి ద్వారా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని తెలుపుతున్నారు. మనిషిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఎక్కువగా జబ్బుల బారినపడే అవకాశం ఉంటుందని, కాబట్టి పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి పెంచే ఫుడ్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి..

చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదు. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, ప్యాన్లు, కూలర్లు వాడకం తగ్గించాలి. చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో బయట తిరగడంతో జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాధులు సోకితే ఆరోగ్యం పాడవుతుంది. వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలి. గణపతిరావు, వైద్యుడు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం న్యాల్‌కల్

చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో ఉపశమనం కోసం సొంత వైద్యం మానుకోవాలి. వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలికాచి చల్లార్చిన నీటిని, వేడి ఉన్న అహారాన్ని తీసుకోవడం మంచింది. చలికాలంలో చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతుల మంచిగా కడుకున్న తర్వాతే ఆహారాన్ని తీసుకోవాలి. కాళ్లు, చేతులు గోరువెచ్చని నీటితో కడుక్కని వ్యాస్‌లెన్, స్కిన్‌లోషన్ రాసుకోవాలి ఇంటి పరిసరాలు, ఇంట్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. దోమతెరలను వాడటం మంచిది. శీతల పానియాలు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వాటిని చిన్నారులకు ఇవ్వకూడదు. చిన్నారులకు స్వెటర్లు వేయకుండా ఇంటాబయట తిరగనివ్వద్దు గుండె సంబంధించిన వ్యాధులతో బాధపడే వారు చాలా జాగ్రతగా ఉండాలి. వీలైనంత వరకు బయట తిరగరాదు. దీంతో గుండెపోటు, ఛాతినొప్పి అవకాశాలు ఎక్కువగా వస్తాయి. హృద్రోగంతో బాధ పడేవారు సమయానికి మందులు వేసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వీలైనంత వరకు సూర్యుడు కాస్త వెలుగులోకి వచ్చిన సమయంలోనే జాగింగ్, వ్యాయామం చేయాలి. సాయంత్రం, రాత్రివేళల్లో వాహనాన్ని నడపక పోవడం మంచిది. ముఖ్యంగా ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లే సమయంలో బాగా చలివేస్తుంది. అలాంటప్పుడు స్కార్ఫ్, జర్కిన్, తలకు హెల్మెట్, మంకీక్యాప్స్, కాళ్లకు షూ, గౌజులు వేసుకోవాలి.

# ఆపరేషన్ లేకుండా ప్రొస్టేట్ సమస్యకు చెక్

హైదరాబాద్: వయసు 50 ఏళ్లు దాటిన పురుషులు దాదాపు 25 శాతం మందిలో ప్రొస్టేట్ (వీర్యగ్రంథి) పెరుగుదల సమస్య ఉత్పన్నమవుతుంటుందని.. ప్రస్తుతం దీనికి అధునాతన చికిత్స అందుబాటులోకి వచ్చిందని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఎండీ, యూరాలజిస్టు డాక్టర్ మల్లికార్జున తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో శస్త్ర చికిత్స చేసి పెరిగిన ప్రొస్టేట్ కణజాలాన్ని కత్తిరిస్తుండగా.. ఇబ్బందులు తలెత్తుతున్నాయ న్నారు. ఇలాంటివి లేకుండా ఏఐఎన్‌యూ ఆధ్వర్యంలో 20 మంది రోగులకు కొత్త విధానంలో చికిత్స చేయగాఅందరూ కోలుకున్నారన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రొస్టేట్ పెరిగినప్పుడు అది మూత్ర మార్గాన్ని నొక్కటంతో విసర్జన బొట్లు బొట్లుగా అవుతుంటుందన్నారు. ఇప్పటికే విదేశాల్లో అందుబాటులోకి వచ్చిన యూరోలిఫ్ట్ అనే పరికరం ద్వారా శస్త్ర చికిత్స లేకుండా ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ సమస్యను పరిష్కరించవచ్చన్నారు. దీన్ని ఏఐఎన్‌యూలో పలువురు రోగులపై విజయవంతంగా పరిశీలించామన్నారు. లోకల్ అనస్థీషియాతో ఈ పరికరాన్ని ప్రొస్టేట్ లోపల అమర్చుతామన్నారు. దీనిలోని వైర్లు పెరిగిన ప్రొస్టేట్ భాగాన్ని వెనక్కి లాగి నొక్కిపెట్టి ఉంచుతాయని, దీంతో ఇబ్బంది లేకుండా రోగులు మూత్ర విసర్జన చేయవచ్చన్నారు. 50 ఏళ్ల వయసు వారికి లైంగిక వాంఛలు సాధారణంగానే ఉంటాయని, కానీ ప్రొస్టేటెక్టమీ శస్త్ర చికిత్స చేసిన వారిలో లైంగిక చర్య తర్వాత వీర్యం బయటకు రాకుండా మూత్రంలో కలిసిపోతుందన్నారు. ఈ పరికరంతో అలాంటి ఇబ్బంది కూడా ఉత్పన్నం కాదన్నారు. ప్రొస్టేట్ పెరుగుదల ఉన్న అందరి రోగులకు ఈ చికిత్స అవసరం అవుతుందని చెప్పలేమన్నారు. తీవ్ర సమస్య ఉన్నవారికే యూరోలిఫ్ట్ చికిత్స సూచిస్తున్నట్లు చెప్పారు.

# ఓట్లు అయిపాయే.. నాట్లకు వేళాయే..!

గరిడేపల్లి : సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో వరినాట్లు మొదలయ్యాయి. నిన్నటి వరకు ఓట్ల పండగతో ఊరూరా నాయకుల ప్రచార సందడి, మైకుల మోత, ఇంటింటి ప్రచారం, బంధుగణం రాక, చివరి రోజు పంపకాలతో గడిచిపోయింది. యాసంగి సీజన్ ఆరంభం కావడంతో అన్నదాత సాగు వైపు దృష్టి సారించారు. సాగర్ నీరు రాకపోయినా బోర్లు, బావుల ఆధారంతోనే సాగునీటిని వాడుకుంటూ వరి నాట్లు మొదలు పెట్టారు. వానాకాలం కంటే కొంతమేర రెండు లక్షల ఎకరాలలో వరి సాగవుతుందనేది అంచనా.

కష్టాల సాగు తప్పదు మరి..

సాగునీటి కష్టాలు అన్నదాతకు తప్పడం లేదు. ఎగువ జలాశయాల్లో వరద లేకపోవడం, నిల్వలు అడుగంటి పోతుండటంతో సాగర్ ఎడమకాల్వకు నీరు రాదనేది స్పష్టమైంది. అయినా ఎంతో కొంత పంట పండించకపోతే ఏడాది పాటు కుటుంబం గడిచేదెట్లా?, అప్పులు తీరేదెలా? అంటూ రైతులు సాగునీటికి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వానాకాలం ఒక్క బోరు ఉంటే ఇప్పుడు అదనంగా రెండు బోర్లు వేసి సాగునీటికి అందుబాటులోకి తెచ్చుకుంటున్నారు. ఒక్క బోరు కింద కనీసం ఎకరమైనా సాగు చేయాలనే సంకల్పంతో నాట్లకు ఉపక్రమించారు. సల్పకాలిక వంగడాలు కావడంతో వానాకాలం పంట ముందుగానే చేతికి వచ్చింది. వాస్తవానికి ఆయకట్టులో జులై, ఆగస్టులో నీరు విడుదల చేస్తే నవంబరు చివరి నుంచి డిసెంబరు 15 వరకు వానాకాలం పంట చేతికి వస్తుంది. అప్పుడు యాసంగికి నారు పోసి జనవరి 15 (సంక్రాంతి వరకు)లోగా నాట్లు వేస్తారు. ఇప్పుడు అందుకు భిన్నంగా తక్కువ పంటకాలం ఉన్న రకాలు (90 రోజుల నుంచి 120 రోజులకే పంట చేతికి వచ్చే రకాలు) సాగు చేయడంతో పంట నవంబరు మొదటి వారంలోనే చేతికి వచ్చింది. వెంటనే నార్లు పోయడంతో నారు ఎదిగి నాటుకు సిద్ధంగా ఉంది.



తక్కువ పంటకాలం ఉన్న వాటికే మొగ్గు..

యాసంగిలో సైతం రైతులు ఎక్కువగా అతి తక్కువ పంటకాలం ఉన్న వంగడాలనే సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. డిసెంబరు 15 వరకు నాట్లు పూర్తయితే మార్చి 15 నాటికి పంట చేతికి వస్తుంది. అప్పుడు తుపాన్లు, వడగళ్ల వానలు, ఈదురుగాలుల ప్రమాదం నుంచి పంటలను కాపాడుకోవచ్చు. అందుకే రైతులు డిసెంబరు 20లోగా నాట్లు వేసుకోవడానికి ప్రణాళిక ప్రకారం ముందుగానే నార్లు (విత్తనాలు చల్లుకోవడం) పోసుకున్నారు. ముందుగా నాట్లు వేయడం వల్ల ఎండల తీవ్రతకు నీటి సమస్య తగ్గిపోతుంది.

భారీగానే సాగుకు సమాయత్తం..

వానాకాలంలో వేల ఎకరాలు ఎండిపోయిన విషయం తెలిసినా అందులో నుంచి బయట పడటానికి అదనంగా నీటి కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలో 15-20 ఎకరాలు సాగు చేసిన రైతు ఇప్పుడు కూడా అంతే సాగు చేయడానికి సిద్ధమయ్యారు. అవసరమైతే అదనంగా నాలుగు బోర్లు వేయడం, వాగులు, చెరువుల నుంచి పైపులైన్లు వేసుకోవడం వంటి ప్రత్యామ్నాయాలను చూసుకుంటున్నారు. పంట తగ్గించేందుకు వెనుకంజ వేయడం లేదు. ఎందుకంటే వానాకాలంలో పుష్కలంగా నీరు ఉండి పంట చేతికి వచ్చిన పొలాలకు 45 బస్తాల దిగుబడి వచ్చింది. అంటే 31.50 క్వింటాళ్ల దిగుబడి రాగా ధర సైతం అనుకూలంగా ఉంది. క్వింటాకు రూ.3,150 నుంచి రూ.3,200 వరకు ఉంది. దాదాపు రూ.లక్ష ఆదాయం వచ్చినట్లే. యాసంగిలో సైతం అంతే ధర ఉంటుందనే నమ్మకం ఉంది. దిగుబడి 40 బస్తాలు వచ్చినా ధర ఆశాజనకంగా ఉంటుండటంతో రైతు వరిసాగు తగ్గించడానికి ఇష్టపడటం లేదు.

# ముక్కోటి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

భద్రాచలం : శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందస్తు ప్రణాళికతో సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం కొలువుదీరే కొద్ది రోజులకే ఈ ఆధ్యాత్మిక సంబరం ఉండడంతో ప్రొటోకాల్ ఇబ్బందులు లేకుండా ఉద్యోగులకు విధులు కేటాయించాలని నిర్ణయించారు. వీవీఐపీల తాకిడి పెరిగే వీలుండడంతో ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది మరోసారి సమీక్ష చేసి దిశను నిర్దేశించనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యత ఉండడంతో కళాకారుల ఎంపిక చేపట్టారు. ముఖ్య కూడళ్లలో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. ఈసారి వీటిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతూ చిన్నచిన్న హంస బొమ్మలనూ అలంకరించనున్నారు. గోపురం తరహా అలంకరణ చేయాలని భావిస్తున్నారు. కోవెలతో పాటు పరిసరాలకు విద్యుత్తు దీపాల అలంకరణ చేస్తున్నారు. రంగులతో మరింత శోభ తెచ్చేందుకు చర్యలు మొదలయ్యాయి. క్యూలైన్లలో సమస్యలు రాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు పాటించనున్నారు.

గోదావరి వద్ద ఏర్పాట్లు: ఈనెల 13 నుంచి 21 వరకు స్వామివారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రధాన ఆలయం నుంచి మాడవీధుల్లో ఊరేగింపు ఉంటుంది. మిథిలా ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలను అందిస్తారు. తిరువీధి సేవలు ఉంటాయి. 22న గోదావరిలో హంస వాహన విహారం (తెప్పోత్సవం) ఉంటుంది. ఆ రోజున సాయంత్రం 4గంటలకు స్వామివారు ఊరేగింపుగా నది వద్దకు వేంచేస్తారు. అక్కడ ప్రత్యేక ర్యాంపులను నిర్మించనున్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు విహరించే తరుణంలో ఉత్సవ శోభను పెంచేందుకు బాణసంచా సందడి ఉంటుంది. లాంచీపై హంస ఆకృతిని తీర్చిదిద్దాల్సి ఉంది. నీటిమట్టాన్ని అంచనా వేసి హంస వాహన విహారం నిర్వహిస్తారు. పనులు పూర్తయ్యాక ట్రయల్ రన్ ఉంటుంది. ఆన్‌లైన్ టిక్కెట్లకు ఆదరణ: 23న ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉత్తర ద్వారదర్శన పూజ ఉంటుంది. ఇందులో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు వీలుగా సెక్టార్లను ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడంతో ఆదరణ వస్తోంది. త్వరలో కౌంటర్లలోనూ విక్రయించనున్నారు. ఎన్నికల కోడ్‌ను తొలగించిన తర్వాత ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందించాలని భావిస్తున్నారు. ఉత్సవాలపై సరైన ప్రచారం చేయాల్సి ఉంది.

# దూది పూల ఆశ.. ధరలు అడియాస



గజ్వేల్: నెల రోజుల కిందట క్వింటాలు పత్తి ధర రూ.7300 పలికింది. రైతులు సంతోషించారు. రానున్న రోజుల్లో మరింత ధర పెరుగుతుందని ఆశించిన రైతులకు ప్రస్తుతం ధర నిరాశ పరుస్తోంది. ప్రైవేటు విపణిలో క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.6700 ఉంది. రైతులు ప్రభుత్వ మద్దతు ధర రూ.7020 విక్రయించుకునేందుకు సీసీఐ వైపు వెళుతున్నారు. పంట విస్తీర్ణం ఆన్‌లైన్‌లో లేకపోవటంతో పలువురు కౌలు రైతులు, ఇతర పెద్ద రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయంచుకుంటూ నష్టాలు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం ఇదే సమయంలో క్వింటాలు ధర రూ.8 వేలకుపైగా పలికింది. సాగుకు వేలకువేలు ఖర్చుచేయగా ఇప్పుడు చేతికందిన పంటకు ధర దక్కకపోతుండటంతో పెట్టుబడికూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. 2021 డిసెంబర్‌లో క్వింటాలు పత్తికి రూ.8850 పలికింది. పెట్టుబడులు పెరగగా పత్తి ధర మాత్రం తగ్గిపోవటంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఎక్కువగా గజ్వేల్‌తోపాటు చిన్నకోడూరు, తొగుట, కొండపాక, దౌల్తాబాద్, బెజ్జంకి, హుస్నాబాద్, చేర్యాల తదితర మండలాల పరిధిలో వేలాది మంది పత్తి సాగు చేశారు. నెలన్నర రోజులుగా జిల్లాలో కొనుగోళ్లు సాగుతున్నాయి. సీసీఐ క్వింటాలు పత్తికి రూ.7020 మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసింది. సీజన్ మొదట్లో మురిపించి మరింత పెరుగుతుందని చాలా మంది రైతులు పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. వారి అంచనాలు తల్లకిందులు చేస్తూ మార్కెట్‌లో ధర రోజుకింత పడిపోతూ వస్తుంది. ప్రస్తుతం రూ.6700 పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి ధర తగ్గిపోవటానికి అంతర్జాతీయ విపణి ప్రభావం అని వ్యాపారులు చెబుతున్నారు. గత నెలలో పత్తి సీడ్స్(గింజలు) క్వింటాలుకు రూ.3850 పలికింది. ఇప్పుడు రూ.2900 దిగువకు పడిపోయిందని.. అలాగే 365 కిలోల బరువు ఉండే క్యాండీ(బేల్) మొన్నటిదాక రూ.72 వేలకుపైగా అమ్ముడవగా ఇప్పుడు రూ.65వేల దిగువకు పడిపోయింది. ఈ ప్రభావం పత్తి కొనుగోళ్లపై పడటంతో ధర పెరగటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. సరుకును ఇంట్లో ఎక్కువ కాలం నిల్వ ఉంచితే బరువు తగ్గిపోవటంతోపాటు ఎలుకలు, అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకోవటం గగనంగా మారుతుంది. జిల్లాలో మంది రైతుల నుంచి ప్రైవేటు వ్యాపారులు 8,258 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. సీసీఐ 3,309 మంది రైతుల నుంచి 4,733 మెట్రిట్ టన్నులు కొనుగోలు చేశారు.

# పెళ్లి వలకు చిక్కొద్దే బాలా!



హైదరాబాద్ : బేగంపేటలోని విశ్రాంత ఉద్యోగికి ఇద్దరు ఆడపిల్లలు. ఓ వెబ్‌పోర్టల్‌లో వారి వివరాలు ఇచ్చారు. చిన్న కుమార్తె నచ్చిందంటూ తండ్రికి ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న యువకుడు వచ్చాడని, వెంటనే పెళ్లి చేసి పంపాలన్నాడు. కట్నం వద్దని, బంగారు ఆభరణాలు చేయించాలంటూ రూ.26 లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. పెళ్లిచూపులు కొత్తగూడెంలోని హెూటల్‌లో చేద్దామన్నారు. వీళ్లు అక్కడకు వెళ్లాక సెల్‌ఫోన్లు స్విచాఫ్ చేశారు.

ఈడొచ్చిన ఆడపిల్లకు సరైన జోడు వెతకాలని తల్లిదండ్రులు ఆశిస్తుంటారు. నచ్చిన భాగస్వామి దొరికితే జీవితం ఆనందంగా సాగుతుందనేది అమ్మాయిల అంతరంగం. ఇటువంటి ఆశలను మాయగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డామంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ముఖం చూపకుండానే రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నగరంలో పది నెలల వ్యవధిలో పెళ్లి పేరిట 30 మంది మోసపోయారు. సుమారు రూ.2 కోట్లు పోగొట్టుకొన్నారు. సైబర్ నేరగాళ్లు, నైజీరియన్లు, నిత్య పెళ్లి కొడుకుల గిమ్మిక్కులకు చిక్కి నష్టపోయి మనోవేదనకు గురికావద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఎలాంటి వారిపై గురి పెడతారంటే..కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులతో ఆలస్యంగా వివాహానికి సిద్ధమైన యువతులు.. భర్తకు దూరమై ఒంటరిగా ఉన్న మహిళలు.. విదేశీ సంబంధాలు కోరుకునే కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటారు. మ్యాట్రిమోనీ సైట్లు, సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఫొటోలు, వివరాలతో.. తోడు కోసం వెతికే వాళ్లను ఎంపిక చేసుకుంటారు. విదేశాల్లో ఉన్నట్టు నమ్మించేందుకు ఆయా దేశాల సిమ్ కార్డులను ఉపయోగిస్తారు. వాట్సప్‌లో ఛాటింగ్ చేసి మానసికంగా దగ్గరవుతారు. ఇక నాటకాన్ని షురూ చేస్తారు. జూబ్లీహిల్స్‌కు చెందిన మహిళ (36)కు మ్యాట్రిమోనీ సైట్ ద్వారా డాక్టర్ పరిచయమయ్యాడు. పెళ్లికి ముందు ల్యాప్‌ట్యాప్, బంగారుగొలుసు పంపుతున్నానంటూ నమ్మించాడు. దిల్లీలో జీఎస్టీ చెల్లించాంటూ రూ.4లక్షలు కాజేశాడు. సికింద్రాబాద్‌కు చెందిన విడాకులు తీసుకున్న, ఇద్దరు పిల్లలున్న మహిళను పెళ్లి చేసుకుంటా నంటూ మ్యాట్రిమోనీ యాప్ ద్వారా పరిచయమైన వ్యక్తి భరోసా ఇచ్చాడు. ఇంగ్లండ్ నుంచి ఇండియాకు వచ్చానని ఫోన్ చేశాడు. 80 వేల పౌండ్లతో వచ్చిన తనను దిల్లీ, ముంబయి విమానాశ్రయాల్లో అదుపులోకి తీసుకున్నారంటూ బాధితురాలి నుంచి రూ.1.50 లక్షలు కొట్టేశాడు.

మాయమాటలతో బోల్తాపడొద్దు- బండారి రవీందర్, ఏసీపీ మహంకాళి

వివాహ పరిచయ వేదికలు, యాప్స్, మ్యాట్రిమోనీ సైట్లలో ఫొటోలు, వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించాక నిర్ణయం తీసుకోండి. అధికశాతం ఒంటరి మహిళలు, ఆలస్యంగా వివాహం చేసుకునేవారే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్లలో సంభాషణలు, చాటింగ్‌లను విశ్వసించవద్దు. వరుడు, కుటుంబం గురించి విచారించాకే నిర్ణయం తీసుకోండి.

# ఉచిత కుట్టు శిక్షణ.. భవితకు నిచ్చెన



కోనరావుపేట: మహిళలు, యువతులు ఉపాధి పొంది స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఉచిత కుట్టు శిక్షణ కోర్సులను నిర్వహిస్తున్నారు. కుట్టు శిక్షణ, బెడ్ నర్సింగ్ కోర్సులను ఉన్నత విద్యనభ్యసిస్తున్న యువతులకు అందిస్తుండటంతో వారు సద్వినియోగం చేసుకున్నారు. నిర్వాహకులు కల్పించిన ఉచిత రవాణా, భోజనం సదుపాయాలను ఉపయోగించుకుంటున్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతులకు నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇప్పటి వరకు అయిదు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేసి తద్వారా స్వయం ఉపాధికి బాటలు వేశారు. జిల్లాలోని కోనరావుపేట మండలం నాగారంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సుల నిర్వహణ కేంద్రం కొనసాగుతోంది. ఇందులో మహిళలు స్వయం ఉపాధి పొందడానికి, ఉపాధి మార్గాలు మెరుగుపర్చుకోవడానికి ఉచిత కుట్టు శిక్షణ, బెడ్ నర్సింగ్ కోర్సులు అందిస్తున్నారు. జిల్లాలో ఆసక్తి ఉన్న యువతులు, మహిళలు కోర్సులకు హాజరవ్వడానికి నిర్వాహకులే ఉచిత ప్రయాణ ఛార్జీలు చెల్లిస్తున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. దీంతో మండల కేంద్రంతో పాటు జిల్లాలోని ఇతర మండలాలకు చెందిన ఇంటర్, డిగ్రీ, పీజీ అభ్యసించిన యువతులు సమయం వృథా చేసుకోకుండా ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొంటున్నారు. మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేసిన తరవాత నిర్వాహకులు యువతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. పలు రకాల బ్లౌజులు, అల్లికలు నేర్చుకోవడం వల్ల ఇంటి దగ్గర స్వయం ఉపాధి పొందడానికి దోహదపడుతుంది.

స్నేహితులందరం సద్వినియోగం చేసుకున్నాం నేను పీజీ ప్రథమ ఏడాది చదువుతున్నాను. డిగ్రీ పూర్తి కాగానే నాతో పాటు గ్రామంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 12 మంది పైగా స్నేహితులం సమయం వృథా చేయకుండా ఉచిత కుట్టు శిక్షణకు హాజరయ్యాం. ఉచిత రవాణా, భోజన, ఇతర సదుపాయాలు కల్పించారు. కుట్టు శిక్షకురాలు రేష్మా పోటీ ప్రపంచానికి అనుగుణంగా శిక్షణలో మెలకువలు నేర్పించారు. ఉన్నత విద్య అభ్యసించే స్నేహితులందరం కలిసి శిక్షణ పూర్తి చేయడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఉపాధి పొందడమే కాకుండా సొంత ఇంట్లో మా దుస్తులను మేమే సమయం దొరినప్పుడు కుట్టుకోవడానికి అవకాశం ఏర్పడింది.

వెలిశాల సంధ్య, మంగళ్లపల్లి

సెలవుల్లో సమయం వృథా చేయకుండా..

ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తరవాత సెలవులను వృథా చేయకుండా తోటి స్నేహితులతో కలిసి జీఎంఆర్ శిక్షణ కేంద్రంలో ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకున్నాం. భవిష్యత్తులో కుటుంబ పోషణలో చేదోడు, వాదోడుగా నిలవడానికి, ఉపాధి అవకాశాలు కలిగి స్వయం సమృద్ధి సాధించడానికి భరోసా కలిగింది. వచ్చే సెలవుల్లో కుట్టు, అల్లికలు నేర్చుకుని నాతో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా అవకాశం లభించనుండటం సంతోషంగా ఉంది. ఎస్.రేఖ, బీఎస్సీ నర్సింగ్ ప్రథమం

ఆసక్తి కనబరుస్తున్నారు

వృత్తి శిక్షణ కేంద్రంలో అందించే ఉచిత కుట్టు శిక్షణ, నర్సింగ్ కోర్సుల పట్ల యువతులు, మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. అభ్యాసకులకు రవాణా ఛార్జీలతో పాటు భోజన, ఇతర వసతులు కల్పిస్తున్నాం. ఉచిత కుట్టు శిక్షణ కోర్సు మూడు నెలలు. ఇప్పటి వరకు అయిదు బ్యాచ్‌లు పూర్తి చేశాం. ప్రస్తుతం ఆరో బ్యాచ్ కొనసాగించటానికి దరఖాస్తులను స్వీకరించాం. బెడ్ నర్సింగ్ శిక్షణ కూడా కొనసాగుతుంది.

మోయ మహేశ్, మేనేజర్, నాగారం

# కనీస మద్దతుకు మించి ధరలు

మహబూబ్‌నగర్ : రైతులు పండించిన సోనా రకం వరికి మంచి ధరలు లభిస్తున్నాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధరగా క్వింటాలుకు రూ.2,203 నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ వ్యవసాయ మార్కెట్లలో క్వింటాలుకు రూ.3,000 మించి ధర లభిస్తుండటం విశేషం. జడ్చర్ల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఏకంగా క్వింటాలుకు రూ.3,150 పలికింది. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,970 ధర వచ్చింది. మహబూబ్‌నగర్ మార్కెట్‌కు 1,296, జడ్చర్ల మార్కెట్‌కు 13,680 క్వింటాళ్ల ధాన్యం వచ్చాయి. దేవరకద్రలో రూ.2,999 ధర వచ్చింది. చాలా మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లకుండా వ్యవసాయ మార్కెట్లు, కర్ణాటకకు పంట తరలిస్తున్నారు. గడచిన వారం, పది రోజులుగా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మరో వారం, పది రోజుల్లో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, ఆంధ్రా, కర్ణాటక నుంచి వచ్చిన వ్యాపారులు పంట కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు నేరుగా కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనూ కనీస మద్దతు ధరకు కొంటున్నా.. రైతులు అక్కడ అమ్మటం లేదు. ఇక సాధారణ రకం



ధాన్యం క్వింటాలుకు రూ.2,183 కొనుగోలు చేస్తున్నారు.

అన్నదాతల్లో ఆనందం : ఎకరాలో వరి సాగు చేసిన ఒక్కో రైతుకు 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఒక్కో రైతు రెండు, మూడు ఎకరాలను సాగు చేశారు. ఐదు నుంచి ఆరు ఎకరాలు వరి సాగు చేసిన ఒక్కో రైతుకు రూ.4లక్షల వరకు ఆదాయం వచ్చింది. వరి సాగు చేసిన చాలా మంది రైతులు రసాయన ఎరువులు చల్లకుండానే దిగుబడులు సాధించారు. వరి సాగు చేసిన రైతులంతా మెరుగైన ఆదాయం రావటంపై సంతోషంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 6.81 లక్షల ఎకరాల్లో వరిని రైతులు సాగు చేశారు.

విత్తనం దొరకట్లే.. : యాసంగిలో నీటి వసతి ఉన్న రైతులందరూ సోనా రకం వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోనా రకం విత్తనం కోసం రైతులంతా వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. 25 కిలోల విత్తన బస్తాను వ్యాపారులు రూ.1,250లకు అమ్ముతున్నారు. వానాకాలంలో ఇదే విత్తన బస్తా రూ.900లకు లభించింది. తెల్ల హంస రకం విత్తనం కూడా దొరకటం లేదు. తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థలోనూ ఈ రెండు రకాల విత్తనం దొరకటం లేదు. రైతులు మాత్రం దొడ్డు రకం విత్తనాలపై ఆసక్తి చూపటం లేదు.

# కొత్త మద్యం దుకాణాలు షురూ

మహబూబ్‌నగర్ :ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు శుక్రవారం విక్రయాలు ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టులో కొత్త మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. దుకాణాలు దక్కించుకున్న వారు ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 2025 నవంబర్ 30వ తేదీ వరకు రెండేళ్ల పాటు మద్యం విక్రయించేందుకు అనుమతి ఉంటుంది. 2021 - 2023 ఏడాదికి టెండర్లు దక్కించుకున్న వారు గత నెల 30వ తేదీతో వారి గడువు ముగిసింది. కొత్తవారు తమ మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మద్యం దుకాణాలు ఉన్నాయి. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 54, నారాయణపేట జిల్లాలో 36, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తి జిల్లాలో 37, జోగులాంబ గద్వాల జిల్లాలో 36 మద్యం దుకాణాలు ఉన్నాయి. దుకాణాలు దక్కించుకున్న వారిలో కొందరు పాత వారే ఉండటంతో వాటిని తిరిగి ప్రారంభించారు. కొత్తగా టెండర్లు



దక్కించుకున్న వారు స్థలం, షాప్‌ల అగ్రిమెంట్ చేసుకోవటం పాటు డిపో నుంచి మద్యం కొనుగోలు తదితర వ్యవహారాలు చూసుకుంటున్నారు. వారు దుకాణాలు ప్రారంభించలేకపోయారు. 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉండటంతో ఆ రోజు దుకాణాలు బంద్ చేసి 4న తిరిగి ప్రారంభిస్తారు. అదే రోజు నుంచి విక్రయాలు ప్రారంభించాలని కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారు యోచిస్తున్నారు.

ఎన్నికల్లో భారీగా విక్రయం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నవంబర్‌లో మద్యం అమ్మకాలు భారీగా సాగాయి. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, అలంపూర్, గద్వాల, కొడంగల్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో మద్యం కొనుగోళ్లు సాగాయి. పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఆత్మీయ సమ్మేళనాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. మద్యం పార్టీలు ఏర్పాటు చేశారు. బీర్లు బాగా అమ్ముడుపోయాయి. గతేడాది నవంబర్‌లో జరిగిన అమ్మకాలతో పోల్చుకుంటే ఈ ఏడాది నవంబర్‌లో రూ.23.05 కోట్ల మేర మద్యం అదనంగా విక్రయించారు. ఆబ్కారీ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ గౌడ్‌ని సంప్రదించగా ఎన్నికల సందర్భంగా అంచనా వేసిన స్థాయిలో మద్యం అమ్మకాలు జరగలేదన్నారు. కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారు ప్రారంభించే ఏర్పాట్లలో ఉన్నారని తెలిపారు.

# నిండు కుండ

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు తర్వాత రెండో పెద్ద జలాశయంగా పేరున్న మూసీ రిజర్వాయర్ పూర్తిగా నిండింది. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలో ఉన్న రిజర్వాయర్ పూర్తిగా నిండేందుకు ఇంకో అర అడుగు మేర మాత్రమే నీరు చేరాల్సి ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో ప్రాజెక్టు నీటిమట్టం ఎప్పటికప్పుడు పెరుగుతుండటంతో నేడో, రేపో గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మూసీ ఎగువ ప్రాంతాలైన హైదరాబాద్ నగరంతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, జనగామ జిల్లాల వాగులు, వంకల ద్వారా ఇటీవలి అకాల వర్షాలకు వరదనీరు వచ్చి చేరింది. దీంతో మండు వేసవిలో మూసీ ప్రాజెక్టు జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతూ నిండుకుండలా మారింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, వరకు 644.50 అడుగులకు చేరుకుంది. నీటినిలువ సామర్థ్యం 4.46



టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.32 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో ఉందని నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మూసీ ఎగువప్రాంతాల నుంచి 1004 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తిగా నిండే దశలో ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# పాలమూరు.. పచ్చని పైరు

మహబూబ్‌నగర్ : పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచే తెలంగాణలోనా.. పాలమూరులోనా.. అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాడిన పాట ఇక్కడి పరిస్థితికి అద్దం పట్టింది. కరవుకు చిరునామాగా ఉన్న పాలమూరే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణ అయ్యింది. తెలంగాణ ఆవిర్భవించాక పరిస్థితి మారింది. ఈ తొమ్మిదేళ్ల కాలంలో పల్లెలు పచ్చబడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. 2014 వరకు ఉమ్మడి జిల్లాలో 7.77 లక్షల ఎకరాల విస్తీర్ణంలోనే సాగు ఉండేది. ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి లభ్యత పెరగటంతో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం 19.34 లక్షల ఎకరాలకు చేరుకుంది. పంటల సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఆదుకున్న రైతుబంధురాష్ట్ర ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన 'రైతుబంధు' ద్వారా ఏటా 9.85 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 24 లక్షల ఎకరాలకు. ఎకరాకు ఒక్కో పంటకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాలో జమవుతోంది. ఐదేళ్లలో రూ.9,760 కోట్లు అందాయి. పంట సాగుకు పెట్టుబడిగా ఈ డబ్బు ఉపయోగపడుతోంది. రైతులు చనిపోతే రైతుబీమా కింద రూ.5లక్షల సాయం అందుతోంది. పాలమూరు జిల్లాల్లో 2018 నుంచి ఇప్పటి వరకు 14,946 మంది రైతులు చనిపోగా బాధిత కుటుంబాలకు రూ.747.3 కోట్లు వచ్చాయి.

జలాశయాలకు నిధుల వరద

సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద పారింది. ఉమ్మడి జిల్లాలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో సహా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు రూ.11వేల కోట్లు కేటాయించారు. భూత్పూరు మండలం కర్వెన వద్ద 2015 జూన్ 11న ప్రతిష్ఠాత్మకమైన పాలమూరు ఎత్తిపోతల పథకం పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.52వేల కోట్ల అంచనాతో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 21 ప్యాకేజీల్లో నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్, లక్ష్మీదేవ్‌పూర్ వద్ద జలాశయాలు, కాల్వలు నిర్మించాల్సి ఉండగా 80 శాతం పనులు పూర్తయ్యాయని అధికారుల చెబుతున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్, భీమా, కల్వకుర్తి తదితర ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఏటా నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో ఆయకట్టు పెరిగింది. 2014లో 1.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. నేడు 8 లక్షల ఎకరాలకు అందుతోంది. మినీ ఎత్తిపోతల కింద 2014లో 13వేల ఎకరాలకు నీరందగా 24వేల ఎకరాలకు పెరిగింది. చెరువుల కింద ఆయకట్టు 84వేల నుంచి 1.87 లక్షల ఎకరాలకు పెరిగింది.

గొర్రెల పంపిణీతో బాసటప్రభుత్వం 2017లో చేపట్టిన రెండో విడత గొర్రెల పంపిణీలో 69,886 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందించారు. ప్రభుత్వం రూ.677కోట్లను రాయితీ రూపంలో ఖర్చుచేసింది. రెండో విడతగా 68,230 యూనిట్ల గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం సుమారు రూ.900కోట్లను రాయితీ రూపంలో ప్రభుత్వం కేటాయించనుంది. జోగులాంబ గద్వాల జిల్లాలో మాదాసి కురవలకు మరో 30వేల యూనిట్లను మూడో విడతలో మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గొర్రెల సంఖ్య రెట్టింపు...మొదటి విడత పంపిణీలో భాగంగా 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇచ్చారు. నావాటితో పాటు మరో ఇద్దరు లబ్ధిదారుల గొర్రెలను కలిపి మేపడానికి ఒక వ్యక్తిని పెట్టుకున్నాం. మా ముగ్గురికి 150 గొర్రెలు ఉన్నాయి.చెన్నప్ప, రామసముద్రం (మక్తల్),నారాయణపేట జిల్లా

ట్రాక్టరు, విత్తనాలకు ఖర్చు చేస్తున్నా.. : నాకు ఐదెకరాల భూమి ఉంది. రైతుబంధు ద్వారా ఏటా రూ.50వేలు వస్తాయి. ఈ మొత్తాన్ని భూమి దున్నే ట్రాక్టరు ఖర్చులకు, విత్తనాల కొనుగోలుకు వినియోగిస్తున్నా. రైతుబంధుతో పెట్టుబడి భారం తగ్గింది.ప్రతాప్‌రెడ్డి, మర్రిపల్లి (చారకొండ), నాగర్‌కర్నూల్ జిల్లా

రైతుబీమాతో భరోసా : నా భర్త పర్వతాలు అనారోగ్యంతో ఆస్పత్రితో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 2న చనిపోయారు. పెద్దదిక్కును కోల్పోయాం. రైతుబీమా ఉండటంతో దరఖాస్తు చేసుకున్నాం. గత వారం రూ.5లక్షల చెక్కు వచ్చింది.

ఈశ్వరమ్మ, వేముల(మిడ్జిల్), మహబూబ్‌నగర్ జిల్లా

గతంలో ఒకే పంట సాగుచేసేవాడిని.. : 2014 కంటే ముందు వర్షాధారంగా ఖరీఫ్‌లోనే పంట సాగు చేసేవాడిని. మా ప్రాంతానికి నెట్టెంపాడు కాలువ వచ్చిన తర్వాత సాగు పెరిగింది. ఇప్పుడూ ఖరీఫ్, రబీలో పంటలను సాగు చేస్తున్నా. పనుల కోసం కూలీలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నాం. వెంకట్‌రాములు, ఎల్కూరు(మల్దకల్), జోగులాంబ గద్వాల జిల్లా

# రక్తహీనతకు చెక్



కరీంనగర్ : గర్భిణులలో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకానికి శ్రీకారం చుట్టింది. మాతా, శిశు మరణాలను తగ్గించడం, గర్భిణులలో రక్తహీనత అంతానికి 'కేసీఆర్ న్యూట్రిషన్ కిట్'ను రూపొందించారు. గతేడాది డిసెంబరులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామారెడ్డి జిల్లాలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అన్ని జిల్లాలో పంపిణీ చేయడానికి నిర్ణయించగా తాజాగా జిల్లాలో పథకాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు..

జిల్లాలో 2106 మంది లబ్ధిదారులు

జిల్లాలోని 20 మండలాలు, ఐదు పురపాలికల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న వారిలో తొలి విడతలో 2106 మంది గర్భిణులు ఉన్నారని గుర్తించారు. వీరికి రెండు విడతల్లో న్యూట్రిషన్ కిట్లను అందజేయనున్నారు. తొలి విడత 13 నుంచి 24 వారాల మధ్య, రెండో విడత 28 నుంచి 34 వారాల మధ్య అందించనున్నారు. గర్భిణులు ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎంల ద్వారా నమోదు చేసుకున్న 13 నుంచి 24 వారాల మధ్య న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారు. ఈ కిట్‌లో గర్భిణులకు ఉపయోగపడే ప్రొటీన్ పౌడర్(కిలో), కిలో ఖర్జూర పండ్లు, అరకిలో నెయ్యి, ఐరన్ సిరప్, అల్బెండజోల్ మాత్రలు, ఒక కప్పు ఉంటాయి. వీటిని తొలి విడత ప్రత్యేక బుట్టలో రెండో విడత సంచులలో అందించనున్నారు. సుమారు ఒక్కో కిట్‌కు రూ.1962 వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో గర్భిణి మహిళలు ఆహారం, పోషకాహారం సరైన మోతాదులో తీసుకోకపోవడంతో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తరచూ మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయి. గర్భిణులలో పోషకాహార లోపం, రక్తహీనతకు న్యూట్రిషన్ కిట్లు వరంగా మారనున్నాయి. ఆయా విడతల్లో గర్భిణులకు ఈ కిట్ల ద్వారా మేలు జరగనుంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగడంతో పాటు రక్తహీనతకు చెక్ పడనుంది.

జిల్లాకు 1550 కిట్లు..జిల్లాలో ప్రస్తుతం 2106 మంది గర్భిణులను గుర్తించాం. జిల్లాకు ప్రస్తుతం 1550 న్యూట్రిషన్ కిట్లు రాగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆసుపత్రులలో గర్భిణులకు కిట్ల పంపిణీ చేపడతాం. న్యూట్రిషన్ కిట్ల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందడంతో పాటు రక్తహీనత లోపాలను తగ్గించవచ్చు. గర్భిణులు కిట్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.డా.జైపాల్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి

# ముంగిట్లోకి.. నవ పాలన



కామారెడ్డి : చిన్న రాష్ట్రాలు అభివృద్ధి సాధిస్తాయి... స్వరాష్ట్ర సాధనకు ఉపయోగపడిన నినాదమిది. తెలంగాణ సిద్ధించాక ప్రజల సంక్షేమం కోసం సర్కారు తపించింది. పాలనలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సర్కారు తొమ్మిదేళ్లలో విప్లవాత్మక, చెప్పుకోదగ్గ మార్పులకు నాంది పలికింది. ముంగిట్లోకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా, మండల, పంచాయతీల వికేంద్రీకరణ ఒక ఎత్తైతే, పాలనలోనూ పారదర్శకతకు సాంకేతికతను జోడించారు. పదో వసంతంలోకి అడుగిడుతున్న తరుణంలో మార్పులను మననం చేసుకుందాం.

కొత్త పంచాయతీలు

రాష్ట్ర ఆవిర్భావం నాటికి పంచాయతీలకు అనుబంధ గ్రామాలుండేవి. ఈ పల్లెలు ఏకంగా పంచాయతీలకు కిలోమీటర్ల దూరం ఉండేది. ప్రజలు పాలనాపరమైన అవసరాల కోసం ఎంతో దూరం ప్రయాణించాల్సి వచ్చేది. స్వరాష్ట్రం సిద్ధించాక అనుబంధ, గిరిజన పల్లెల కల సాకారమైంది. పంచాయతీ హోదా లభించడంతో గ్రామాభివృద్ధికి అడుగులు పడ్డాయి. స్వరాష్ట్రంలో ఉభయ జిల్లాల్లో 364 నూతన పంచాయతీలు ఏర్పాటయ్యాయి.

పుర హోదా...

అన్ని అర్హతలున్నా మేజర్ పంచాయతీలకు పుర హోదా కల్పించడంలో గత పాలకులు తాత్సారం చేశారనే వాదన ఉంది. రాష్ట్రం ఆవిర్భవించాక ఉమ్మడి జిల్లాలో ఎల్లారెడ్డి, బాన్సువాడ, భీమ్‌గల్‌లకు బల్దియా హోదా లభించింది. రూ.25 కోట్ల చొప్పున టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయించారు. ఉద్యానవనాలు, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనతో కొత్తగా ఆవిర్భవించిన మున్సిపాలిటీల్లో వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తోంది.

సాంకేతిక శోభ

ఒకప్పుడు మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ తిరిగి అడిగినంత ముడుపులు సమర్పించుకునే దుస్థితి ఉండేది. రాష్ట్రం సిద్ధించాక పారదర్శకత కోసం స్వయంగా దరఖాస్తు చేసుకుని, నిర్ణీత గడువులోగా అధికారులు పరిష్కరించకపోతే అనుమతి లభించేలా నిబంధన తీసుకొచ్చారు. స్వయంగా దరఖాస్తు చేసుకోవడం, ఆస్తిపన్ను స్వీయ మదింపు వంటి సదుపాయాలతో టీఎస్‌బీపాస్‌ను తెచ్చారు. గ్రామాల్లోనూ సులభతర పాలనకు ఈ-పంచాయతీ ఉంది. ఆన్‌లైన్‌లో చెల్లించే వ్యవస్థతో మధ్య దళారులకు అడ్డుకట్ట వేయడానికి దోహదం చేశారు.

రవాణా సేవలు

రవాణా శాఖలో సులభతరమైన సేవలు అందుకోవడానికి స్మార్ట్ (సింపుల్, మోరల్, అకౌంటబుల్, రెస్పాన్సివ్ అండ్ ట్రాన్స్‌పరెంట్- ఎస్.ఎం.ఏ.ఆర్.టి)ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సిటిజన్ చార్టర్‌తో నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో బాన్సువాడ డివిజన్ ప్రజలు లైసెన్సులు పొందడానికి బోధన్ రావాల్సి వచ్చేది. తాజాగా బాన్సువాడలోనే సేవలు అందిస్తున్నారు. వాహన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు వంటివి 'ఎంవ్యాలెట్'లో స్మార్ట్‌ఫోన్‌లో భద్రపరచుకునే అవకాశం కల్పించారు.

ఐటీ కంపెనీలు

ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను విస్తరించే కార్యక్రమాన్ని సర్కారు తీసుకుంది. గ్రామీణ యువతకు ఐటీ ఉద్యోగాలను చేరువ చేయడం, హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించే ఆశయంతో తీసుకొచ్చిన విధానంలో నిజామాబాద్‌లో ఐటీ హబ్ నిర్మించారు. రూ.50 కోట్లతో నిర్మించిన ఇందులో కనీసంగా వెయ్యి మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఆస్కారముంటుందని ప్రకటించారు.

పోలీస్‌శాఖలో సంస్కరణలు

స్నేహపూర్వక పోలీసింగ్ ప్రస్తుతం ఓ విధానమైంది. పారదర్శక, సత్వర సేవలే లక్ష్యంగా సాంకేతికతను వినియోగించి మార్పులు చేపట్టారు. పోలీస్ కార్యాలయాలు, ఠాణాల్లో ఈ-ఆఫీస్(కాగిత రహిత) సేవలు అమలు చేస్తున్నారు. కేసు పూర్వాపరాలను ఆన్‌లైన్ చేసే సీసీటీఎన్ఎస్ (క్రైమ్ కంట్రోల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం)ను ప్రారంభించారు. 5ఎస్(ఐదు రకాల సేవలు ఏకకాలంలో అందుబాటులోకి తేవడం) విధానం అమల్లోకి వచ్చాక ఠాణాలో ఏ అధికారి అందుబాటులో ఉన్నా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

భూ దస్త్రాల ప్రక్షాళన

భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం 2016 సెప్టెంబరులో భూదస్త్రాల నవీకరణకు శ్రీకారం చుట్టింది. నిజాం కాలం నాటి దస్త్రాలను నవీకరించి రైతులకు డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించింది. భూముల క్రయవిక్రయాలు పారదర్శకంగా చేపట్టేందుకు రిజిస్ట్రేషన్‌తో పాటే మ్యుటేషన్ ఏకకాలంలో అయ్యేలా ధరణి పోర్టల్ దోహదపడుతోంది. ప్రస్తుతం కేవలం వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపడుతున్నారు.

శాఖల పునర్విభజన

సాగు నీటిపారుదల శాఖతో పాటు ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖలను పునర్విభజన చేయడంతో పనితీరు మెరుగుపడింది. ప్రస్తుతం నీటిపంపిణీతో పాటు పనుల పర్యవేక్షణను ఒకే విభాగం కిందకు తీసుకువచ్చి ఉభయ జిల్లాలకు సీఈలను నియమించారు. ఆర్‌అండ్‌బీతో పాటు పీఆర్ ఇంజినీరింగ్ శాఖల్లో సమూల మార్పులు తీసుకువచ్చారు. ర.భ. శాఖను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో నిజామాబాద్ జిల్లాకు నూతనంగా ఆర్‌అండ్‌బీ ఎలక్ట్రికల్ డివిజన్, ఎన్‌హెచ్ సర్కిల్, బిల్డింగ్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి.

కొత్త మండలాలు

స్వరాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటు వేగంగా సాగుతోంది. కామారెడ్డి జిల్లా ఆవిర్భావ సమయంలో కొత్తగా బీబీపేట, రామారెడ్డి, పెద్దకొడపగల్, రాజంపేట, నస్రుల్లాబాద్ మండలాలు ఏర్పడ్డాయి. అనంతరం స్థానిక ప్రజల కోరిక మేరకు మద్నూర్ మండలం నుంచి డోంగ్లీని కొత్తమండలంగా చేశారు. తాజాగా మాచారెడ్డి మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామాలతో పల్వంచ మండలాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాల విభజన సమయంలో నిజామాబాద్ జిల్లా పరిధిలో చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాలను ఏర్పాటు చేశారు. తాజాగా డొంకేశ్వర్, సాలూరా, ఆలూరు, పోతంగల్ కొత్తగా ఏర్పాటయ్యాయి.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

దశాబ్ది ఉత్సవాలకు కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన వేదికతో పాటు ప్రజలు, అధికారులు కూర్చోవడానికి వీలుగా టెంట్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయిస్తున్నారు.

# జాడలేని సాయంత్రం క్లీనిక్‌లు

బోధన్ : యూపీహెచ్‌సీ స్థాయిలో స్పెషాలిటీ సేవలు విస్తరించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సాయంత్రం క్లీనిక్‌లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. నెలకొల్పిన తర్వాత ఒకటి, రెండు నెలలలోపే మూతపడ్డాయి. గతేడాది ఇదే సమయంలో వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కానీ కొన్ని కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో ఆదరణ లేకపోవడం, ఆరోగ్య మిషన్ నుంచి నిధుల కేటాయింపు లేక వీటిని అర్ధాంతరంగా అనధికారికంగా నిలిపివేశారు. నిజామాబాద్ నగరంలో మూడు, బోధన్‌లో ఒక యూపీహెచ్‌సీలో వీటిని ఏర్పాటు చేసి ఎత్తేశారు.

ఇదీ పరిస్థితి: వైద్య వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమాలకు ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. వ్యాధులు ప్రాణాంతకం కాక మునుపే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నియంత్రించడానికి పలు కార్యక్రమాలు తీసుకొచ్చారు. వాటిలో ఒకటి ఈ సాయంత్రం క్లీనిక్. యూపీహెచ్‌సీల్లో వారంలో మూడు రోజుల పాటు క్లీనిక్‌లు నిర్వహిస్తారు. ఒక్కో రోజు ఒక స్పెషాలిటీ వైద్య నిపుణుడు అందుబాటులో ఉంటారు. వారిలో స్త్రీ, పిల్లల వైద్య నిపుణులు, ఫిజిషియన్ ఒక్కో రోజు ఒకరు సేవలందిస్తారు. వీరికి ఒక రోజుకు 20 మందికి పైగా ఓపీ నమోదైతే వైద్యులకు రూ.3 వేలు, స్టాఫ్‌నర్సుకు రూ.200, నాలుగో తరగతి ఉద్యోగికి రూ.100 చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. కానీ ఇక్కడికి రోగులు 20 మంది కంటే తక్కువగానే వస్తున్నారని గుర్తించారు. బోధన్‌లో మాత్రం 20కి పైగా వచ్చినట్లు చెబుతున్నారు.సరైన వైద్యం అందే వీలు: జనం నుంచి సరైన స్పందన లేదనే భావన ఉన్నతాధికారుల్లో వ్యక్తమవడంతో వీటిని నిలిపివేశారు. ఇక చేసిన పనికి సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. ఈ విషయంలో వైద్యాధికారులను సంప్రదిస్తే స్పందించడానికి నిరాకరించారు. వైద్య నిపుణుల సేవలు స్థానికంగా అందుబాటులో ఉంటే పట్టణం, నగరంలోని మారుమూల కాలనీవాసులకు ఇవి ప్రయోజనకరంగా ఉండేవి. బస్తీల్లో పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకునే వారు ఆ సమయంలో స్పెషాలిటీ డాక్టర్లు ఉండటంతో పరీక్షలు చేయించుకుని ప్రాథమిక స్థాయిలోనే సరైన వైద్యం అందుకునే వీలు ఉండేది. అధికారులు స్పందించి వీటిని తిరిగి తెరవాలని బోధన్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పంచాయతీలకు కంతుల కిరికిరి

ధరూరు : ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటికి కొన్ని పంచాయతీలు ఒకే సారి నగదు చెల్లించి కొనుగోలు చేయగా.. కొన్ని చోట్ల ప్రతి నెలా కంతులు చెల్లించేలా ఒప్పందంతో తీసుకున్నారు. ఇదే ఇప్పుడు పంచాయతీ పాలకవర్గాలకు ఇబ్బందిగా మారింది. మూడు కంతులు చెల్లించకుండా ఉంటే బ్యాంకు అధికారులు నోటీసులు ఇస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర నిధులు అభివృద్ధి పనులకు కేటాయించకుండా బ్యాంకుల్లో కంతులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకే సరిపోతున్నాయని ఆయా సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోజు వారీగా ట్రాక్టర్ డీజిల్ ఖర్చు ఆర్థికభారంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రతి నెలా చిన్న పంచాయతీలకు భారంగా మారుతోంది.

132 పంచాయతీలకు నోటీసులు నిబంధనల మేరకు సకాలంలో కంతులు చెల్లించక పోతే వాహనాలను జప్తు చేసే అధికారం బ్యాంకు అధికారులకు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 1,684 పంచాయతీల్లో 132 పంచాయతీలకు సంబంధించిన ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించని కారణంగా ఆయా బ్యాంకుల అధికారులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆరు నెలలకు ఒకసారి నిధులు వస్తుండటంతో సకాలంలో కంతులు చెల్లించకుంటే ఇబ్బందిగా ఉంటుందని భావించిన కొందరు సర్పంచులు అప్పు చేసి బ్యాంకులకు



చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఖాతాలో జమయ్యాక తీసుకుంటున్నారు. ఆలాంటి పంచాయతీలు 220 వరకు ఉన్నట్లు సమాచారంఈఎంఐ చెల్లించకుంటే ఖాతా డిఫాల్ట్ అవుతుందనే ఉద్దేశంలో ప్రతి నెలా కంతు సమయానికి ప్రగతి నిధులు రాకున్నా అప్పు చేసి బ్యాంకులో జమ చేస్తున్నట్లు జోగులాంబ జిల్లాలో ఓబులోనిపల్లి పంచాయతీ సర్పంచి పరశురాముడు తెలిపారు. ఖాతాలో ప్రగతి నిధులు జమయ్యాక తిరిగి తీసుకుంటున్నానని పేర్కొన్నారు.

ప్రభుత్వం చెల్లిస్తే ఇబ్బంది ఉండదుజిల్లాలో సగం వరకు పంచాయతీల పాలకవర్గాలకు ప్రతి నెలా ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాంకు కంతుల సమస్య ఉంది. ప్రభుత్వం ప్రగతి నిధుల ద్వారా ఒకేసారి సెటిల్‌మెంట్ చేస్తే ఇబ్బంది ఉండదు. వచ్చే నిధులు ఇతర అభివృద్ధి పనులకైనా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.మాజీద్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జోగులాంబ గద్వాల

# జోరుగా పైరవీలు!

పాలమూరు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించిన సహాయ ఆచార్యుల్లో కొంతమంది ఇక్కడ పనిచేయడానికి అంతగా సుముఖత చూపటం లేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం గత నెల 22న 147 మంది సహాయ ఆచార్యులను కేటాయించింది. అందులో ఇప్పటివరకు 75 మందే విధుల్లో చేరారు. ఇంకా 72 మంది చేరలేదు. ఈ నెల 21 వరకు గడువు ఉండటంతో వారంతా అప్పటివరకు చూద్దాములే అన్నట్లు యోచిస్తున్నారు. పలువురు ఇతర ఆసుపత్రుల్లో పని చేస్తున్నారు. ఇప్పటికే కొద్దిమంది విధుల్లో చేరినవారు, చేరకుండా ఉన్నవారిలో కొందరు వేరే ప్రాంతాలకు వెళ్లడానికి రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడి(డీఎంఈ) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. అక్కడ పైరవీలు చేసుకుంటూ తమకు అనుకూలమైన ప్రాంతాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. క్లీనికల్ విభాగంలో ఉమ్మడి జిల్లాకు వచ్చిన వారిలో కొందరికి ప్రస్తుతమున్న ప్రాంతాల్లో సొంత క్లీనిక్‌లు ఉన్నాయి. అవి బాగా నడుస్తుండటంతో విధుల్లో చేరడానికి కొందరు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

వినతుల బదిలీలతో ముగ్గురు అసోసియేట్లు.. : మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అసోసియేట్ ఆచార్యులు కూడా రిక్వెస్ట్ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. జనరల్ మెడిసిన్ అసోసియేట్ ఆచార్యులు డా.కేశవనాథ్‌గౌడ్ జనగామా జిల్లాకు, పాథాలజీ అసోసియేట్ ఆచార్యులు డా.శ్రీలక్ష్మి వికారాబాద్ జిల్లాకు, అనస్థీషియా అసోసియేట్ ఆచార్యులు డా.సునీత వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అసోసియేట్ ఆచార్యులు వెళ్తే వారి స్థానాల్లో ఎవరూ కొత్తవారు



రాలేదు. ఇప్పటికే తక్కువ మంది ఆచార్యులతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు ముగ్గురు వెళ్లిపోవటం సమస్యగా మారింది. కొత్తగా సహాయ ఆచార్యులు వచ్చినా.. అసోసియేట్ ఆచార్యులపై పని భారం అధికంగా పడనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల వైద్య కళాశాలలకు కేటాయించిన సహాయ ఆచార్యులంతా వచ్చి విధుల్లో చేరితేనే సమస్య తీరుతుంది. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించిన 32 సహాయ ఆచార్యుల్లో 24 మంది, నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించిన 59 మందిలో 29, వనపర్తి జిల్లాకు కేటాయించిన 56 మందిలో 22 మంది విధుల్లో చేరారు. ఈ నెల 22వ తేదీ తర్వాత గానీ ఎంత మంది జిల్లాలకు వస్తారు, ఎంత మంది వెళతారో స్పష్టత వచ్చే అవకాశం లేదు.

చివరివరకు చూస్తాం.. : సాధ్యమైనంత వరకు ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతారు. మహబూబ్‌నగర్‌కు కేటాయించిన వారిలో ఎక్కువ మంది ఇక్కడే ఉంటారని అనుకుంటున్నా. రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల వద్ద పైరవీలకు తావుండదు. తప్పనిసరిగా వారంతా కేటాయించిన జిల్లాల్లోని కళాశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. సకాలంలో రాకపోతే ప్రభుత్వానికి తెలియచేస్తాం. ఇంకా 20 రోజుల గడువు ఉంది. చివరివరకు చూస్తాం.డా.రమేశ్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్

# 'మీ ఓటమి అసహనాన్ని పార్లమెంట్‌లో చూపించొద్దు': కాంగ్రెస్‌కు మోదీ సూచన



దిల్లీ: ఉత్తరాదిన మూడు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాషాయ జెండా రెపరెపలాడిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కమలం పార్టీ విజయ ఢంకా మోగించింది. ఈ ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్రమోదీ మరోసారి స్పందించారు. ప్రజలు నెగెటివిటీని తిరస్కరించారని ప్రతిపక్షాలనుద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. శీతాకాల సమావేశాల నిమిత్తం పార్లమెంట్‌కు వచ్చిన ప్రధాని మీడియాతో మాట్లాడారు. "ఈసారి శీతాకాలం కాస్త ఆలస్యమైంది. రాజకీయ వేడి మాత్రం విపరీతంగా పెరిగింది. ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సంతృప్తినిచ్చాయి. సుపరిపాలన, జనహితం కోసం పాటుపడిన వారికి ప్రజలు పట్టం కట్టారు. మహిళ, యువత, రైతులు, పేదలే ప్రధాన కులాలని నమ్మి.. వారి సాధికారిత కోసం పనిచేస్తున్న వారికి ప్రజల నుంచి మద్దతు లభించింది. ప్రజల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తే.. ప్రభుత్వ వ్యతిరేకత అనే పదం ఉండదని రుజువైంది" అని ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం%) పార్టీకి ఆయన సూచనలు చ్తేశారు. "నెగెటివిటీని ఈ దేశం తిరస్కరించింది. ఈ ఫలితాలను చూసిన తర్వాత ప్రతిపక్ష సభ్యులకు నేను ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఇది వారికి సువర్ణావకాశం. ఈ ఓటమిపై విసుగు చెంది ఆ నిరాశను పార్లమెంట్‌లో చూపించాలనుకునే ఆలోచనలు మానాలి. గత 9 ఏళ్లుగా వారికి అలవాటుగా మారిన నెగెటివిటీని పక్కనబెట్టి ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే.. ఈ దేశం కూడా వారిపై ఉన్న అభిప్రాయాన్ని మార్చుకుంటుంది. వారు ప్రతిపక్షంలో ఉన్నా సరే.. వారికో సలహా ఇస్తున్నా. ప్రతి ఒక్కరి భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. నమ్మకాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. మీ ఓటమి తాలూకు అసహనాన్ని పార్లమెంట్‌లో ప్రదర్శించొద్దు" అని మోదీ కాంగ్రెస్‌కు హితవు పలికారు. ఇక, శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో సభ్యులంతా ఫలప్రదమైన చర్చలు జరపాలని కోరారు. నేటి నుంచి డిసెంబరు 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.




మిగ్‌జాం తుపాను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని 14 రైల్వే సబ్‌వేల్లోకి నీరు చేరడంతో వాటిని మూసివేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నగరం, చుట్టుపక్కల జిల్లాల్లో మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను ఇప్పటికే చెన్నైలో మోహరించారు. తాంబ్రం ప్రాంతంలో ఇప్పటికే ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు.. నీటిలో చిక్కుకొన్న 15 మందిని కాపాడాయి. బాసిన్ బ్రిడ్జ్, వ్యాసర్‌పాడి మధ్యలోని బ్రిడ్జ్ నెం:14ను మూసివేసినట్లు ప్రకటించారు. ఈ ప్రాంతంలో చాలా ప్రదేశాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా చెన్నైలోని పాఠశాలలు మూసివేశారు. నగరంలోని కోర్టులకు సెలవు ఇచ్చినట్లు మద్రాస్ హైకోర్టు ప్రకటించింది. వీలైనంత వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని అధికారులు కోరారు. చెన్నై-మైసూర్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్ కోవై ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్, కేఎస్‌ఆర్ బెంగళూరు ఏసీ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, కేఎస్‌ఆర్ బెంగళూరు బృందావన్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం రద్దు చేశారు. దీంతోపాటు సబర్బన్ రైళ్లను కూడా రద్దు చేశారు. నగరంలోని పలు పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. వలసరవాక్కంలో 154 ఎంఎం, నుంగంబాక్కంలో 101 ఎంఎం, చోలింగనల్లూరులో 125 ఎంఎం, కోడంబాక్కంలో 123 ఎంఎం, మీనంబాక్కం 108 ఎంఎం వర్షపాతం నమోదైంది. కుండ పోత.. కాంచీపురం, చెంగల్‌పట్టు, తిరువల్లూరు జిల్లాలో కూడా భారీ వర్షాలు పడుతున్నాయి. చెన్నైలోని కాంతూరు ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఓ గోడ కూలి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఈస్ట్‌కోస్టల్ రోడ్డులో సోమవారం ఉదయం చోటు చేసుకొంది. కిల్పాకు మెడికల్ కాలేజీలోని ఓ వార్డు ఓపీ విభాగంలోకి వరద చేరింది. దీంతో ఈ విభాగాన్ని మొదటి ఫ్లోరుకు తరలించారు. చెన్నైలోనీ ఎంటీసీ సంస్థ మొత్తం 2,800 బస్సుల్లో కేవలం 600 మాత్రమే తిప్పుతోంది. చాలా మంది సిబ్బంది విధులకు హాజరుకాలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కోయంబత్తూరు- చెన్నై మధ్యలో రెండు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఇండిగో ప్రకటించింది. చాలా విమానాలను చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి మళ్లించారు. ఇప్పటి వరకు దాదాపు 11 విమానాలను దారి మళ్లించినట్లు సమాచారం.

# తుఫాను సహాయక చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి



అమరావతి: "మిచాంగ్" తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పందించారు. తుఫాను సహాయక చర్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టాన్ని నివారించేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంపై మిచాంగ్ తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందనే సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. తుఫాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పక్కా ప్రణాళిక ద్వారా అన్నదాతలకు నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరారు. గతంలో అకాల వర్షాల కారణంగా ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయినా... ప్రభుత్వం తగు రీతిలో స్పందించ లేదన్నారు. ధాన్యం కొనుగోలులో రకరకాల ఆంక్షలతో ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలన్నారు. తుఫాను బాధిత ప్రజల కోసం షెల్టర్లు, అవసరమైన ఆహారం అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, నేతలు తుఫాను బాధితులకు అండగా నిలవాలని టీడీపీ అధినేత పిలుపునిచ్చారు. పలు జిల్లాలపై తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని.. బాధిత వర్గాలకు అండగా ఉండాలని, చేతనైన సాయం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

# లోకేశ్ యువగళం కు బ్రేక్ - ఆకస్మిక నిర్ణయం వెనుక..!!



తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక, ఇప్పుడు ఏపీలో రాజకీయం పైన ఆసక్తి పెరుగుతోంది. తెలంగాణ ఫలితాలు ఏపీలో ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ మొదలైంది. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుతో ముందుకు వెళ్తున్నాయి. బీజేపీ వైఖరి పైన స్పష్టత రావాల్సి ఉంది. ఇదే సమయంలో సీఎం జగన్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇటు నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. యువగళం పాదయాత్రకు బ్రేక్ ఇచ్చారు. యాత్రకు బ్రేక్: తెలుగుదేశం కీలక నేత నారా లోకేశ్ తన యువగళం యాత్రకు విరామం ప్రకటించారు. లోకేశ్ తన యాత్రలో భాగంగా 215వ రోజు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యూ కొత్తపల్లి మండలం శీలంవారి పాకలు గ్రామంలో దళిత గలం బహిరంగ సభలో పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసారు. చంద్రబాబు అరెస్ట్ తో ఆగిన పాదయాత్ర తిరిగి నవంబర్ 27న ప్రారంభమైంది. ఈ నెల 17న విశాఖలో భీమిలి వద్ద యాత్ర ముగించేలా తొలుత నిర్ణయించారు. అక్కడ ముగింపు సభకు చంద్రబాబు, పవన్ హాజరవ్వాలని నిర్ణయించారు. కానీ, ఇప్పుడు మరోసారి లోకేశ్ యాత్ర కు బ్రేక్ పడింది. ఈ మేరకు లోకేశ్ కీలక ప్రకటన చేసారు. ఏపీకి మిచౌంగ్ తుఫాన్ ముప్పు కారణంగా పాదయాత్రకు మూడు రోజుల విరామం ప్రకటించారు. తుపాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం, ఈదురుగాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావం తగ్గాక ఈనెల 7న మళ్లీ శీలంవారి పాకల నుంచి యువగళం ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సమయంలోనే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సహాయకచర్యల్లో టిడిపి నేతలు-కార్యకర్తలు పాల్గొనాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా యువగళం పాదయాత్రకి విరామం ప్రకటించానని తెలిపారు. విపత్తుల సంస్థ జారీ చేసే హెచ్చరికలు ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**మారుతున్న లెక్కలు:** సురక్షిత ప్రదేశాలలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని కోరారు. అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడేలా మొబైల్ ఫోన్లు చార్జింగ్ ఉంచుకోవాలని, శిథిల భవనాలలో అస్సలు ఉండొద్దని హెచ్చరించారు. టిడిపి కేడర్ స్వచ్ఛందంగా తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇక, కేంద్రంలో మరోసారి ముందస్తు ఎన్నికల ప్రస్తావన రావటంతో ఏపీలోని పార్టీలు అప్రమత్తం అవుతున్నాయి. మరో మూడు నెలల కాలంలో ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేలా వ్యూహాల అమలు దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ ఫలితాలతో ఏపీలో ఎలాంటి ఫలితం వస్తుందనే అంచనాల పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# రోశయ్య హుందాతనం నిండిన రాజకీయాలు సాగించారు



అమరావతి: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య రెండో వర్ధంతి సందర్భంగా జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర పాలనలో చెరిగిపోలేని ముద్ర వేసిన వ్యక్తి రోశయ్య అని అన్నారు. హుందాతనం నిండిన రాజకీయాలు సాగించారన్నారు. కీలకమైన సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోశయ్య రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో తన వంతు కృషి చేశారన్నారు. శాసనసభలో ఎప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ అందరికీ సమాన గౌరవం ఇచ్చే రోశయ్య శాసనసభకే హుందాతనం తీసుకొచ్చారన్నారు. నిండుగా ఎప్పుడూ నవ్వుతూ, కొత్తవారిని ప్రోత్సహిస్తూ రాజకీయాలు చేశారని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# మిచాంగ్ తుపానుతో రైతులు ఎవరూ అధైర్యపడొద్దు

## రైతులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమావేశం



విజయవాడ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడారు. మిచాంగ్ తుపానుతో రైతులు ఎవరూ అధైర్యపడొద్దని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధైర్యం చెప్పారు. ఎలాంటి పరిస్థితిలో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని మంత్రి పేర్కొన్నారు. వీలైనంత త్వరగా రైతులు తమ ధాన్యాన్ని అందుబాటులో ఉన్న మిల్లులకు తరలించుకోవాలని రైతులకు సూచించారు. ఏ మిల్లర్ అయినా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆదేశించారని మంత్రి తెలిపారు. మిచాంగ్ తుపాను తీవ్రత తగ్గే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.




అమరావతి: మిగ్‌జాం తుపాను గంటకు 14కి.మీ వేగంతో ముందుకు కదులుతున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపాను బంగాళాఖాతంలో వాయవ్య దిశగా కదులుతున్నట్లు వెల్లడించింది. చెన్నైకి 130కి.మీ, నెల్లూరుకు 220కి.మీ. బాపట్లకు 330కి.మీ, మచిలీపట్నానికి 350కి.మీ దూరంలో కేంద్రీకృతమైనట్లు తెలిపింది. నేడు కోస్తా తీరానికి సమాంతరంగా పయనించనున్న తుపాను.. మంగళవారం మధ్యాహ్నం నాటికి తీవ్ర తుపానుగా మారి నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించింది.

**కోస్తా జిల్లాలో వర్షాలు..** తుపాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరుతో పాటు తిరుపతి జిల్లాలో వర్షం కురుస్తోంది. పలుచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షంతో ఆయా ప్రాంతాల్లో చలి ప్రభావం పెరిగింది. బాపట్ల సహా పలు తీరప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తుపాను తీవ్రత దృష్ట్యా జిల్లాల్లో అధికారులకు సెలవులను రద్దు చేశారు.

**తుపాను ఎఫెక్ట్.. పలు జిల్లాలో స్కూళ్లకు సెలవు :** మిగ్‌జాం తుపాను నేపథ్యంలో పలు జిల్లాల్లో పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. విశాఖపట్నంతో పాటు కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. విద్యార్థుల రక్షణ దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు కూడా తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని డీఈవోకు ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

# ఏకపక్ష ఫలితాలు ఆందోళనకరం: మాయావతి



నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు ప్రజలను ఆశ్చర్యం కలిగించడంతోపాటు భయపెట్టాయని ఆమె ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. ఈ ఫలితాలపై చర్చించి.. 2024 లోక్‌సభ ఎన్నికలపై వ్యూహాన్ని ఖరారు చేసేందుకు డిసెంబర్ 10న సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. "రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో ప్రచార సమయంలో పరిస్థితి చూస్తే.. హోరాహోరీ పోరు తప్పదనిపించింది. కానీ, ఎన్నికల ఫలితాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఏకపక్షంగా వచ్చిన ఈ ఫలితాలు చూసి ప్రజలు సందేహపడటం, ఆశ్చర్యపోవడం, భయపడటం సహజమే. ఎన్నికల వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకొంటే.. ఇలాంటి విచిత్రమైన ఫలితాలు చూసి ఆమోదించడం ప్రజలకు కష్టమే. ప్రజానాడిని గ్రహించడంలో ఘోరంగా విఫలం కావడం చర్చనీయాంశం. ఈ ఎన్నికల్లో బీఎస్పీ సభ్యులు పూర్తి శక్తియుక్తులతో పోరాడారు. వారు ఈ ఫలితాలను చూసి నిరాశ చెందకూడదు. అంబేద్కర్ స్ఫూర్తితో కష్టాలపై నిరంతరం పోరాడుతుండాలి" అని మాయావతి పేర్కొన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు వ్యూహాన్ని సిద్ధం చేసేందుకు బీఎస్పీ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా 10వ తేదీన ఆల్-ఇండియా స్థాయిలో పార్టీ నాయకులతో లఖ్‌నవూలో భేటీ ఏర్పాటు చేసింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో భాజపా విజయం సాధించగా.. తెలంగాణ కాంగ్రెస్ ఖాతాలో పడింది. దేశంలోని రెండు ప్రధాన రాజకీయ కూటముల్లో చేరికపై బీఎస్పీ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. అధికార ఎన్డీయేకిగానీ, ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన 'ఇండియా' కూటమికిగానీ మద్దతిచ్చేది లేదని తెలిపింది. సొంత బలంతోనే లోక్‌సభ ఎన్నికలకు వెళ్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు బీఎస్పీ ఉత్తర్‌ప్రదేశ్ శాఖ ఇటీవల ప్రకటన విడుదల చేసింది.

## స్వర్గం నుండి వచ్చిన మాగ్నోలియా పువ్వు

నిహారిక కొణిదెల.. పరిచయం అవసరం లేదు. మెగా ప్రిన్సెస్‌గా అభిమానులు ఆరాధిస్తారు. నటిగా, యాంకర్ గా, నిర్మాతగా .. ఆల్ రౌండర్ పనితనం కనబరిచిన నిహారిక వ్యక్తిగత జీవితంలో కొన్ని ఎపిసోడ్ల గురించి అభిమానులకు స్పష్టంగా తెలుసు. అదంతా అటుంచితే ఇటీవల తన సోదరుడు వరుణ్ తేజ్ పెళ్లిలో ఎంతో ఆనందంగా తేజోవంతంగా కనిపించింది నీహారిక. పెళ్లి వేడుక ఆద్యంతం సందడి చేస్తూ, ఫోటోషూట్లలో ఎంతో వైభవంగా మైమరిపించింది. ఆ తర్వాత కూడా వరుస ఫోటోషూట్లతో అభిమానుల ముందుకు వస్తోంది. తాజాగా నిహారిక బ్లూ డిజైనర్ ఫ్రాక్ లో తళతళా మెరిసిపోతున్న ఫోటోలను షేర్ చేసింది. ఈ లుక్ లో నిహారిక మునుపటి కంటే స్పెషల్ గా ఉందంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బ్లూ డ్రెస్ పై రకరకాల కామెంట్లు



వినిపిస్తున్నాయి. ఒక అభిమాని.. బ్లూ కాదు మేడమ్ .. ఇది చాలా హాలి అని అన్నాడు. అంత నీలిరంగు లేదు అని కూడా ఒకరు వ్యాఖ్యానించారు. వావ్ మీరు స్వర్గం నుండి వచ్చిన మాగ్నోలియా పువ్వులా ఉన్నారు.. బృహస్పతి యురేనస్ మెర్క్యురీ నెప్ట్యూన్.. ప్లూటో తాజే కేర్ హ్యాపీ వీకెండ్ అని ఒక అభిమాని కవిత అల్లాడు. నిహారిక అందచందాలకు ఫిదా అయిపోయిన ఉపేంద్ర యాదవ్ పిళ్లై అనే యువకుడు సోషల్ మీడియాల్లో ఒక అడుగు ముందుకు వేసి నిహారికను ఆరాధిస్తున్న కవితలు షేర్ చేసాడు. ఏది ఏమైనా నిహారికను తిరిగి ఆరాధించేవారు అంతకంతకు పెరుగుతున్నారు. ఒక అభిమాని అయితే నిహారిక తిరిగి నటించాలని ఎంతో ప్రాధేయపడుతూ అడిగాడు. పలువురు అతడిని అనుసరిస్తూ నిహారిక తిరిగి నటనలోకి రావాలని కోరారు. నిహారిక నటనను విరమించలేదు. అడపాదడపా నటిస్తోంది. అయితే తను సీరియస్ గా నటనా కెరీర్ లో కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. మునుముందు నిహారిక ఏదైనా పెద్ద తెర ప్రయత్నంతో టచ్ లోకి వస్తుందేమో చూడాలి.

## స్టార్ కిడ్ బ్రాండ్ వ్యాల్యూ అమాంతం స్కైలోకి

జెడ్డాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ వర్ధమాన తార అనన్య పాండే భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సినిమాల్లోని వైవిధ్యాన్ని ఆవిష్కరించే అరుదైన పండుగ ఇది. ఈ వేడుకలకు అనన్య పాండే 'వానిటీ ఫెయిర్ ఉమెన్ ఇన్ సినిమా ఫోరమ్'కు హాజరయ్యారు. అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతను తెలియజేసారు అనన్య. "రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వంటి గౌరవనీయమైన ఉత్సవంలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను.. ఈ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణం" అని అన్నారు. అందాల కథానాయిక భాగస్వామ్యం కచ్చితంగా భారతీయ సినిమాపై పెరుగుతున్న ప్రపంచ ప్రభావాన్ని పరిశ్రమలోని ప్రతిభను హైలైట్ చేస్తుంది. రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ మూడవ ఎడిషన్ వేడుకలు కొద్దిరోజులుగా వైభవంగా సాగుతున్నాయి. 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం చలనచిత్ర నిర్మాణ ప్రపంచంలోని అంతర్జాతీయ ప్రాంతీయ ప్రతిభావంతుల నుండి ఉత్తమమైన షోలను ప్రదర్శించేందుకు చిత్రనిర్మాతలు, సినీ ప్రేమికులు, సాంకేతిక నిపుణులను ఒకచోట చేర్చుతుంది. ఇటీవల అనన్య పాండే తన బ్రాండ్



వ్యాల్యూను అమాంతం పెంచుకుంటోంది. న్యూయార్క్ నగరంలో స్వరోవ్స్కీ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ప్రారంభోత్సవానికి అనన్య హాజరైంది. ఈ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా సేవలందిస్తోంది. సోషల్ మీడియాలో సెరెనా విలియమ్స్, ఫ్రీదా పింటో, కిమ్ కర్దాషియాన్ సహా అనేక మంది అంతర్జాతీయ ప్రముఖులతో కలిసి ఉన్న ఫోటోలను అనన్య పోస్ట్ చేసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య పాండే చివరిసారిగా ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'డ్రీమ్ గర్ల్ 2'లో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. తదుపరి 'ఖో గయే హమ్ కహాన్'లో ఆదర్శ్ గౌరవ్ – సిద్ధాంత్ చతుర్వేదిలతో కలిసి నటించనుంది. అర్జున్ వరైన్ సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 26న నెట్‌ఫ్లిక్స్ లో విడుదలకు సిద్ధంగా ఉంది. ఖో గయే హమ్ కహాన్‌తో కల్తీ లేని స్నేహం నేపథ్యంలో రూపొందించిన సినిమా. ఇది సోషల్ మీడియాల్లో పరిచయమైన 20 ఏళ్ల లోపు ఉన్న ముగ్గురు స్నేహితుల గురించిన కథాంశమిది. కమింగ్–ఆఫ్–డిజిటల్–యుగం కథగా చెబుతున్నారు.




## నితిన్ శ్రీలీల ఊర మాస్ డప్పుల మోత




టాలీవుడ్ హీరో నితిన్ ఈసారి ఎక్స్ ట్రా ఆర్డినరి మ్యాన్ అనే సినిమాతో ఎలాగైనా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకొని బౌన్స్ బ్యాక్ అవ్వాలి అని అనుకుంటున్నాడు. ఇక అతను ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ సినిమా డిసెంబర్ 8వ తేదీన గ్రాండ్ గా విడుదల కాబోతోంది. ఈ సినిమాకు ప్రమోషన్స్ తో అయితే చిత్ర యూనిట్ సభ్యులు పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యే విధంగా అడుగులు వేస్తూ ఉన్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు టీజర్ ట్రైలర్ అలాగే సాంగ్స్ కూడా హైలెట్ గా నిలిచాయి. ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ తో పాటు యాక్షన్ ఎలిమెంట్స్ తో కూడా ఆకట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. నితిన్ కు జోడిగా శ్రీ లీల నటించిన విషయం తెలిసిందే. ఇక మరొక పాటను కూడా త్వరలో విడుదల చేయబోతున్నారు. ఓలే ఓలే అమ్మాయి అనే పాట ప్రోమోను రీసెంట్గా విడుదల చేయగా అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంది. పాటలో నితిన్ శ్రీల ఇద్దరూ కూడా మాస్ స్టెప్పులతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉన్నారు. నితిన్ ప్రతి సినిమాలో కూడా డాన్స్ తో కూడా డిఫరెంట్ గా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఇక అతనికి జోడిగా ఈసారి శ్రీల కలవడంతో వీరి కలయిక విజిల్స్ వేయించేలా ఉందని అనిపిస్తోంది. ఇక హరీష్ జయరాజ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. రామ్ మిరియాల పాడిన ఈ ఫుల్ పాట డిసెంబర్ 4వ తేదీన విడుదల చేయబోతున్నారు. తప్పకుండా ఎక్స్ ట్రా ఆర్డినరి మ్యాన్ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉ ంటుంది అని ప్రమోషన్స్ ద్వారా చెప్పకనే చెబుతున్నారు. ఇక ఈ సినిమా హీరో నితిన్ శ్రీలీల కు మాత్రమే కాకుండా డైరెక్టర్ వక్కంతం వంశీకి కూడా చాలా ఇంపార్టెంట్. ఎందుకంటే దర్శకుడిగా అతని మొదటి సినిమా నా పేరు సూర్య అంతగా కట్టుకోలేదు. ఇక ఇప్పుడు ఎక్స్ ట్రా సినిమా మాత్రం మంచి సక్సెస్ ఇస్తుంది అని నమ్ముతున్నాడు. ఈ సినిమాతో పాటు పోటీగా నాని హాయ్ నాన్న సినిమా ఒకరోజు ముందుగానే, అంటే డిసెంబర్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరి ఈ పోటీలో నితిన్ ఎక్స్ ట్రా సినిమా ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.

## ఈ కిల్లర్ భంగిమ చూసారా?



అందానికి అందం ప్రతిభతో అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ సినీయవనికపై దూసుకుపోతోంది. డే బై డే ఈ బ్యూటీ పరిణతి చెందిన నటన, ఫ్యాషన్ సెన్స్‌తో ఆకట్టుకుంటోంది. జాన్వీ తదుపరి 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'లో రాజ్‌కుమార్ రావుతో కలిసి నటించింది. ధర్మ ప్రొడక్షన్స్ ఇటీవల తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త విడుదల తేదీని ప్రకటించింది. 19 ఏప్రిల్ 2024న 'మిస్టర్ అండ్ మహి' థియేటర్లలోకి రాబోతోంది. జాన్వీ నటిస్తున్న ప్రతి సినిమా కథాంశం దేనికదే ప్రత్యేకమైనది. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ఒక స్పోర్ట్స్ డ్రామా . రూహి తర్వాత జాన్వీ – రాజ్‌కుమార్‌ల కలయికలో రెండో చిత్రమిది. ఈ చిత్రానికి శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తదుపరి భారీతనం నిండిన కమర్షియల్ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్– సైఫ్ అలీఖాన్‌లతో పాటు జాన్వీ కనిపించనుంది. దేవర అనేది ఈ సినిమా టైటిల్. దీనిని రెండు భాగాలుగా కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. జాన్వీ టాలీవుడ్ డెబ్యూపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై శ్రీదేవి అభిమానుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. వైవిధ్యం కేవలం కెరీర్ పరంగానే కాదు.. ఫ్యాషన్ సెన్స్ పరంగానూ ప్రదర్శిస్తోంది జాన్వీకపూర్. ఈ యంగ్ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో వేవ్స్ క్రియేట్ చేస్తున్నాయి. బికినీలు చిట్టి పొట్టి దుస్తుల్లో జాన్వీ హొయలు మతులు చెడగొడుతున్నాయి. ఇప్పుడు అందుకు భిన్నంగా సోఫాలో వేడెక్కించే భంగిమలతో మైండ్ బ్లాంక్ చేసింది జాన్వీ. ఉలెన్ సోఫాలో క్రీగంటి చూపులతో కిల్ చేస్తూ అందమైన స్మైల్ తో కవ్విస్తోంది జాన్వీ. ఎంపిక చేసిన టాప్ కుర్రబ్యూటీ అందాలను ఆవిష్కరిస్తుండగా, బాటమ్ లో ఆ చారల ఫ్యాంట్ ఎంతో డీసెంట్ గా ఉ ంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. గత రెండేళ్లుగా మాల్దీవుల నుంచి జాన్వీ కపూర్ స్పెషల్ బికినీ షూట్లు యువతరం కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిచ్చాయి. మరోసారి అలాంటి ట్రీట్ కోసం ఇప్పుడు అంతా వేచి చూస్తున్నారు. దేవర షూటింగ్ సమయంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అలాంటి మరో ట్రీట్ ని ఆశిస్తున్నారు.

## పుష్పకు సడన్ బ్రేక్.. ఎందుకంటే?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నేషనల్ అవార్డు అందుకున్న తర్వాత మరింత పవర్ఫుల్ గా పుష్ప 2 సినిమా షూటింగ్లో పాల్గొంటున్నాడు. దర్శకుడు సుకుమార్ సైతం ఈసారి అంతకుమించి అనేలా పుష్పరాజ్ ను ప్రజెంట్ చేసేందుకు హార్డ్ వర్క్ అయితే చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో హాలిడేస్ కూడా తీసుకోకుండా సండేలు కూడా వర్క్ చేస్తూ సినిమా షూటింగ్ కోసం కష్టపడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్న సమయానికి సినిమాను పూర్తి చేయాలి అని ఒకవైపు సుకుమార్ మరొకవైపు అల్లు అర్జున్ బలంగా ఫిక్స్ అయినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్స్ కూడా అప్పుడప్పుడు అభిమానులను ఎంతగానో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. చాలా రోజులుగా పుష్ప 2 సినిమా షూటింగ్ రామోజీ ఫిలిం సిటీ లో జరుగుతోంది. రీసెంట్గా అయితే వారం రోజులు గ్యాప్ లేకుండా కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు ఒక పాట చిత్రీకరణ కూడా జరిగింది. అయితే ఇప్పుడు హఠాత్తుగా షూటింగ్



కు బ్రేక్ పడినట్లుగా తెలుస్తోంది. మళ్లీ డిసెంబర్ 2వ వారం నుంచి కొనసాగించే విధంగా నిర్మాతలు నిర్ణయం తీసుకున్నట్లు టాక్. ఎందుకంటే అల్లు అర్జున్ వెన్నునొప్పితో కాస్త ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. ఇక ముందు జాగ్రత్తగా రెస్టు తీసుకుంటే బెటర్ అని షూటింగ్ కు బ్రేక్ ఇచ్చినట్లు కథనాలు వెలువడుతున్నాయి. మళ్లీ వీలైనంత త్వరగా కోలుకొని షూటింగ్లో పాల్గొనాలని కూడా బన్నీ డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. కేవలం ఒక వారం గ్యాప్ ఇచ్చి మళ్లి డిసెంబర్ రెండో వారం షూటింగ్లో వేగాన్ని పెంచాలని మైత్రి నిర్మాతలకు బన్నీ సూచించినట్లు సమాచారం. రూ.300 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో ఈ సినిమాను అయితే నిర్మిస్తున్నారు. ఇక 2024 ఆగస్టు 15న విడుదల చేయబోతున్నట్లు క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. పుష్ప ఫస్ట్ పార్ట్ కంటే ఈసారి సెకండ్ పార్ట్ అంతకుమించి అనేలా ఉంటుంది అని కూడా చిత్ర యూనిట్ ఒక మంచి నమ్మకాన్ని అయితే కలిగిస్తోంది. ఇక మిగిలిన షూటింగ్ ను వీలైనంత త్వరగా పూర్తిచేసి ఈసారి ప్రమోషన్స్ కోసం కూడా స్పెషల్ ప్లాన్ వేయాలని అనుకుంటున్నారు. అప్పట్లో ఫస్ట్ పార్ట్ సమయంలో ప్రమోషన్స్ కు ఎక్కువ సమయాన్నీ కేటాయించలేకపోయారు.

ఇక ఇప్పుడు మాత్రం అలాంటి ఇబ్బంది లేకుండా సినిమా షూటింగ్ ముందుగానే చేయబోతున్నారు.

## బ్రేకప్‌పై హీరో హ్యాపీ.. దీపికతోనేనా?

ప్రముఖ హీరో తన మాజీ నుంచి విడిపోయినందుకు సంతోషం వ్యక్తం చేసాడు. ఫలానా స్టార్ హీరోయిన్ నుంచి విడిపోయినందుకేనా? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పాత ప్రేమను ఇప్పుడు కొత్తగా తవ్వి తీస్తున్నారు!! ఇంతకీ ఈ సన్నివేశం ఎవరి నడుమ? అంటే వివరాల్లోకి వెళ్లాలి. ఈ ఎపిసోడ్ లో బ్రేకప్ అయిన హీరో రణబీర్ కపూర్. ఎవరితో అంటే దీపిక పదుకొనేతో అని ఊహాగానాలు సాగిస్తున్నారు. ఇంతలోనే రణబీర్ కపూర్ పాత వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో అతడు తాను విడిపోవడం గురించి.., మరెన్నో సంతోషకరమైన విషయాల గురించి పేర్కొన్నాడు. అతడి నిష్కపటమైన ఒప్పుకోలును మెచ్చుకోకుండా ఉ ండలేరు. రణబీర్ కపూర్ పాత వీడియో రకరకాల కారణాలతో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు రణబీర్ కపూర్ వ్యక్తిగత జీవితం అతడి వృత్తిగత జీవితంతో పోలిస్తే ఎక్కువగా హెడ్ లైన్స్ లో నిలిచింది. %బీ% టౌన్‌లోని పాపులర్ కథానాయికలతో ఎఫైర్లు, బ్రేకప్ ల కారణంగా యానిమల్ స్టార్ కాసనోవాగా పాపులరయ్యాడు. రణబీర్ కపూర్ ... కరణ్ జోహార్ 'కాఫీ విత్ కరణ్' షోలో ఆనందంగా కనిపించాడు. మునుపెన్నడూ లేని విధంగా నిజాయితీగా మాట్లాడాడు.



రణబీర్ నటించిన తాజా చిత్రం యానిమల్ బాక్సాఫీస్ వద్ద వేవ్స్ క్రియేట్ చేస్తోంది. కంటెంట్ పరంగా అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కరణ్ జోహార్ కాఫీ విత్ కరణ్ షోలో రణబీర్ కపూర్ తన జీవితం గురించి నిష్కపటంగా దాపరికం లేకుండా మాట్లాడాడు. అతడు తనను తాను నిషేధించుకున్నాడు. రణబీర్ రాపిడ్ ఫైర్ ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. తనను హోస్ట్ కరణ్ కొన్ని వివాదాస్పద ప్రశ్నలు అడిగాడు. వాటికి అతడు సంతోషంగా సమాధానమిచ్చాడు. కథానాయికతో బ్రేకప్ గురించి రణబీర్‌ని ప్రశ్నించగా దాని గురించి వివరాలు చెప్పాడు. అయితే ఆ సమయంలో అతడు కత్రినా కైఫ్‌తో డేటింగ్ చేస్తున్నందున దీపికా పదుకొణె గురించి మాట్లాడుతున్నాడని నెటిజనులు భావిస్తున్నారు. హీరోయిన్లతో ఆన్‌స్క్రీన్ ముద్దులు పెట్టుకోకపోవడంపై స్పందించమని రణబీర్ కపూర్‌ను అడిగారు. దానికి అతడు స్క్రీన్ కోసం వారిని ముద్దుపెట్టుకుంటానని చెప్పాడు. నిజానికి కపూర్ బోయ్ ఆ సమయంలో కాసనోవా ఇమేజ్‌లో జీవించేవాడు. అతడు కండోమ్‌ను ఉపయోగించడాన్ని కూడా ఆమోదించాడు. దానిని ఎలా ఉపయోగించాలో ఎలా దుర్వినియోగం చేయకూడదో కూడా తెలిపాడు. వరుస ప్రేమాయణాలకు ముగింపు పలికి, చాలా గ్యాప్ తర్వాత రణబీర్.. ఆలియా భట్‌ను సంతోషంగా వివాహం చేసుకున్నాడు.



# సీఎల్పీ నేత ఎంపిక బాధ్యత ఖర్గేకి..

హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం (సీఎల్పీ) ముగిసింది. గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ఆ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలంతా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఏఐసీసీ పరిశీలకులతో కలిసి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశామన్నారు. సీఎల్పీ నేత ఎంపికపై ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని తీసుకున్నామని చెప్పారు. సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఇవ్వాలని ఎమ్మెల్యేలు చెప్పారన్నారు. ఆ మేరకు ఈ సమావేశంలో తీర్మానం చేసినట్లు చెప్పారు. ఖర్గే నిర్ణయాన్ని శిరసావహిస్తామని ఎమ్మెల్యేలు ఆ తీర్మానంలో పేర్కొన్నట్లు డీకే శివకుమార్ తెలిపారు.
సుమారు గంటపాటు సీఎల్పీ భేటీ కొనసాగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులుగా డీకే శివకుమార్‌తో పాటు దీప్‌దాస్ మున్షీ, జార్జ్, అజయ్, మురళీధరన్ హాజరయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహతో పాటు పలువురు సీనియర్లు పాల్గొన్నారు.

# కుటుంబం బాధలో ఉన్నా.. పార్టీని గెలిపించారు: నడ్డాపై ప్రధాని ప్రశంసలు

దిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో భాజపా స్పష్టమైన మెజార్టీతో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాపై ప్రశంసలు కురిపించారు. పార్టీలో తన బాధ్యతలను నడ్డా సమర్థవంతంగా నిర్వహించడం వల్లనే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నప్పటికీ.. ఆ ప్రభావం పార్టీపై పడకుండా పనిచేశారని అభినందించారు. "పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా అవిశ్రాంత కృషి వల్లే మూడు రాష్ట్రాల్లో భాజపా విజయాలు సాధ్యమయ్యాయి. ఎన్నికలకు ముందు ఆయన తన కుటుంబంలోని ఓ వ్యక్తిని కోల్పోయారు. అయినప్పటికీ.. మనోధైర్యం కోల్పోకుండా పూర్తి నిబద్ధత, అంకితభావంతో పార్టీని ముందుకు నడిపించారు" అని ప్రధాని మోదీ అన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్



ఫలితాలు వెలువడిన తర్వాత జేపీ నడ్డా కుటుంబసభ్యులతో కలిసి దిల్లీలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొన్న ఆయన.. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి మూడు రాష్ట్రాల ఫలితాలు నిదర్శనమని అన్నారు.

# కిషన్ రెడ్డిపై పార్టీలో తీవ్ర విమర్శలు




హైదరాబాద్: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఆ పార్టీలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలిపించుకోలేదు.. సొంత నియోజకవర్గం అంబరుపేటలో కూడా బీజేపీ అభ్యర్థి కృష్ణాయాదవ్ ఓటమిపాలయ్యారు. కేంద్రమంత్రిగా ఉండి ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలిపించుకోలేని కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా విఫలయ్యారంటూ బీజేపీ క్యాడర్ విమర్శిస్తోంది. కాగా తెలంగాణలో బీజేపీ మెరుగుపడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 7 శాతం ఓట్లతో కేవలం ఒక్క సీటును మాత్రమే గెలుచుకున్న పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లతో పాటు.. 14 శాతం ఓట్ షేర్ సాధించింది. 19 స్థానాల్లో రెండో స్థానాల్లో పార్టీ అభ్యర్థులు నిలిచారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌లను ఓడించి బీజేపీ అభ్యర్థి వెంకటరమణరెడ్డి సంచలనం నమోదు చేశారు. హైదరాబాద్ గోషామహాల్ నుంచి రాజసింగ్ హ్యాట్రిక్ సాధించారు. ఈటల రాజేందర్ పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓడిపోయారు. దుబ్బాక సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందనరావు భారీ తేడాతో ఓడిపోయారు. ఎంపీలు సోయం బాపూరావు, ధర్మపురి అర్వింద్, బండి సంజయ్ ఓటమి చెందారు. బీజేపీకి బీసీ సీఎం, ఎస్సీ వర్గీకరణ అంశాలు కలిసొచ్చాయి. అయితే జనసేనతో బీజేపీ పొత్తు అంతగా ప్రభావం చూపలేదు. లక్ష్మణ్ నియజకవర్గం ముషీరాబాద్‌లోనూ బీజేపీ అభ్యర్థి ఓటమి చెందారు.

# జస్ట్ మిస్.. కొద్దిలో గట్టెక్కింది వీరే.. భారీ మెజార్టీ వీళ్లదే..

హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల పర్వం ముగిసింది. కాంగ్రెస్‌ను భారీ మెజార్టీలో ప్రజలు గెలిపించారు. దీంతో, ప్రభుత్వ ఏర్పాట్లకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ?ప్రమాణ స్వీకారానికి ప్లాన్ జరుగుతోంది. మరోవైపు, ఎన్నికల్లో కొద్ది ఓట్ల మార్జిన్‌తో, భారీ మెజార్టీతో కొందరు అభ్యర్థులు విజయం సాధించారు.




**బొటాబొటీ ఓట్లతో గట్టెక్కింది వీరే..** చేవెళ్లలో కాలె యాదయ్య (బీఆర్ఎస్) కేవలం 268 ఓట్ల అతి తక్కువ మెజార్టీతో గెలిచారు. యాకుత్‌పురలో జాఫర్ హుస్సేన్ (ఎంఐఎం) 878 ఓట్లు, జుక్కల్‌లో లక్ష్మీకాంతరావు (కాంగ్రెస్) 1,152, దేవరకద్రలో గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్) 1,392, నాంపల్లిలో మాజిద్ హుస్సేన్ (ఎంఐఎం) 2,037, బోధన్‌లో పి.సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్) 3,062, సిర్పూరులో హరీశ్‌బాబు (బీజేపీ) 3,088, కరీంనగర్‌లో గంగుల కమలాకర్ (బీఆర్ఎస్) 3,163, బాల్కొండలో వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్ఎస్) 4,533, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి (బీఆర్ఎస్) 4,606, ఖానాపూర్‌లో ఎద్మ బొజ్జు (కాంగ్రెస్) 4,702 ఓట్లతో తక్కువ మెజార్టీ సాధించారు.




**20 మందికి 50వేలకుపైగా మెజారిటీ** : రాష్ట్రంలో 20 మందికిపైగా ఎమ్మెల్యేలు 50 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో కేపీ వివేకానంద్ (బీఆర్ఎస్) 85,576 ఓట్ల మెజార్టీ సాధించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు (బీఆర్ఎస్) 82,308, చాంద్రాయణగుట్టలో అక్బరుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) 81,660, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు (బీఆర్ఎస్) 70,387, నకిరేకల్ నుంచి వేముల వీరేశం (కాంగ్రెస్) 68,839 ఓట్ల మెజార్టీతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. 50 వేలపైన మెజార్టీ సాధించినవారిలో కాంగ్రెస్ నుంచి 13 మంది, బీఆర్ఎస్ నుంచి నలుగురు, ఎంఐఎం నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఉన్నారు.

# బండి సంజయ్‌ని మార్చాక మా నుంచి ప్రజలు కాంగ్రెస్ వైపు మళ్లారు




మహబూబ్‌నగర్: ప్రజలు మార్పు కోరుకున్నారని.. బీఆర్ఎస్ మాకొద్దు అని డిసైడ్ చేసుకున్నారని మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తెలిపారు. బీజేపీలో మార్పులు జరిగాయని.. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉంటే తమ పార్టీ అధికారంలోకి వచ్చేదన్నారు. బండి సంజయ్‌ని మార్చాక మా నుంచి ప్రజలు కాంగ్రెస్ వైపు మళ్లారన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పరిపాలన చేయలేదు కాబట్టే.. కర్ణాటకలో ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడిందన్నారు. ఇక్కడ వారు ఇచ్చిన హామీలు అమలు చేయలేరని.. వారికి కేంద్ర ప్రభుత్వ అండ లేదని జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. మన రాష్ట్రం ఐదు సంవత్సరాలు వెనక్కి పోయిందన్నారు. అయినా రేవంత్ రెడ్డి.. యెన్నం శ్రీనివాసరెడ్డి మంచి పాలన అందించాలని కోరుకుంటున్నాన్నారు.
మరో 30 ఏళ్లు దేశంలో బీజేపీ పాలనే ఉంటుందన్నారు. దీనికి నిదర్శనం.. మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయమేనన్నారు. 2024లో బంపర్ మెజారిటీతో తాము గెలుస్తామని జితేందర్ రెడ్డి పేర్కొన్నారు.




# అనుముల రేవంత్ రెడ్డి పొలిటికల్ జర్నీ...

ఆయన.. ప్రత్యర్థులకు చుక్కలు చూపించే నాయకుడు. ప్రజల నాడి పట్టి వారిలో చైతన్యం నింపే నేత. 20 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజా సమస్యలే ధ్యేయంగా అలుపెరగని పోరాటం చేసిన లీడర్. ఈ అంశాలే ఆయన్ని పురాతన జాతీయ పార్టీకి రాష్ట్ర బాధ్యతలు చేపట్టేలా చేసింది. అదీ అనధి కాలంలోనే. ఇప్పుడు ఏకంగా సీఎం రేసులోకి రావడంతో తెలంగాణ ప్రజల చూపంతా ఆ నేతపైనే ఉంది. ఇప్పటికే మీకర్థం అయి ఉంటుంది. ఆయనెవరో కాదు.. అనుముల రేవంత్ రెడ్డి. పెయింటర్ నుంచి యువ నాయకుడిగా ఎదిగి.. సీఎం కేసీఆర్‌ను ఢీ కొట్టి తన రాజకీయ ప్రయాణానికి సుస్థిర బాటలు వేసుకున్న రేవంత్ జీవిత చరిత్ర గురించి తెలుసుకుందాం..

**వ్యక్తిగత విషయాలు..** రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8న నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో జన్మించారు. ఆయన సతీమణి గీత. తండ్రి అనుముల నర్సింహారెడ్డి, తల్లి అనుముల రామచంద్రమ్మ. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గ్యాడ్యుయేషన్ పట్టా పొందారు. రేవంత్ రెడ్డికి తొలుత ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. ఆయన కింది స్థాయి నుంచి రాజకీయ నేతగా ఎదిగారు. మొదట జడ్పీటీసీ ఇండిపెండెంట్ గా గెలిచారు. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్(బీఆర్ఎస్), బీజేపీ వంటి పార్టీలను ఎదుర్కొని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మిడ్జిల్ నుంచి 2007లో జెడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఈ గెలుపు పార్టీలన్ని ఒక్కసారిగా రేవంత్ వైపు చూసేలా చేశాయి. అక్కడే ఆయన నాయకత్వ లక్షణాలు బయటపడ్డాయి. తరువాత ఎమ్మెల్సీగా గెలివడంతో అప్పటికే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాయిన్ కావాలని ఆహ్వానించినా.. దివంగత సీఎం ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఉన్న అభిమానంతో టీడీపీలో చేరారు.

**రాజకీయ జన్మనిచ్చిన టీడీపీ...** తెలుగుదేశం పార్టీ నుండి 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుండి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ అభ్యర్థులు రావులపల్లి గుర్నాథ్ రెడ్డి పై విజయం సాధించారు. ఆ విజయం ఆయన చరిష్మాను మరింతగా పెంచింది. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున మరోసారి బరిలో దిగిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారం చేపట్టింది. అప్పటి నుంచి అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతూ ఉండేవారు. రేవంత్ 2014 – 2017 మధ్య టీడీఎల్పీ ఫ్లోర్ లీడర్ గా ఉన్నారు. 2017 అక్టోబర్లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. 3 ఏళ్ల అనధికాలంలోనే ఎవ్వరికి దక్కని హోదాతో కాంగ్రెస్ అధిష్టానం ఆయనకి కీలక బాధ్యతలు అప్పగించింది. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ లో పోటీ చేసి ఓడిపోయారు. 2019 మే లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా(టీపీసీసీ) జూన్ 26, 2021లో కాంగ్రెస్ పార్టీ నియమించింది. రేవంత్ రెడ్డి 2021 జులై 7న అప్పటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జీ మాణిక్యం ఠాగూర్ సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి కేసీఆర్ పాలనపై వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. ఆయన్ని ఓడించడమే లక్ష్యంగా టీడీపీని వీడి కాంగ్రెస్ లోకి వచ్చి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డారు. చివరికి డిసెంబర్ 3, 2023న తన లక్ష్యాన్ని చేరుకున్నారు. కేసీఆర్‌ని ఓడించి ముఖ్యమంత్రిగా ప్రమాణ బాధ్యతలు చేపట్టేస్థాయికి ఎదిగారు. ఉనికే ప్రశ్నార్థకంగా మారిన కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చడంలో ఆయనే కీలక పాత్ర పోషించారడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఓటుకు నోటు కేసు..** శాసన మండలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయడానికి నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు లంచం ఇవ్వజూపిన కేసులో మే 31 2015న, రేవంత్ రెడ్డిపై స్టింగ్ ఆపరేషన్ చేసి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేసింది. అవినీతి నిరోధక చట్టం, సెక్షన్లు 120–B (నేరపూరిత కుట్ర) సెక్షన్ల కింద క్రిమినల్ కేసు – ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 34 కింద రేవంత్‌తో పాటు మరో ఇద్దరు – బిషప్ సెబాస్టియన్ హ్యారీ, ఉదయ్ సింహాలను అరెస్ట్ చేసింది. వీరిని చర్లపల్లి సెంట్రల్ జైలుకి తరలించింది. జూన్ 30న వీరికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2015 జులై 1న రేవంత్ రెడ్డి విడుదలయ్యారు. ఈ కేసు తాలూకు చేదు అనుభవాలు ఇప్పటికీ రేవంత్ ని వెంటాడుతున్నాయి.



# గోల్ కొట్టిన సునీల్!

హైదరాబాద్ : రాష్ట్రంలో ఇప్పుడు అందరి నోటా వినపడుతున్న పేరు సునీల్ కనుగోలు. రాజకీయవ్యూహాలు రచించడంలో తలపండిన కేసీఆర్‌ను ఢీకొట్టి.. కొద్ది నెలల కాలంలోనే కాంగ్రెస్‌ను విజయతీరాన్ని చేర్చడం వెనుక ఎన్నికల వ్యూహకర్త సునీల్ కీలకంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు.

అటు భారాస, ఇటు భాజపాల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ... ఎప్పటికప్పుడు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తూ.. కాంగ్రెస్ పార్టీ నేతలను నడిపించారన్న పేరుంది. కర్ణాటకకు చెందిన సునీల్ కనుగోలు దేశంలోని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తల్లో ఒకరిగా పేరుపొందారు. గతంలో ఆయన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందంలో కీలకసభ్యుడిగా పనిచేశారు.

**కర్ణాటక ఎన్నికలు, జోడో యాత్రకూ ఆయనే :** ఉదయ్‌పూర్‌లో కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నవ సంకల్ప్ డిక్లరేషన్ అమలు కోసం నియమించిన టాస్క్‌ఫోర్స్ 2024 బృందంలో ఆయన్ను తొలుత సభ్యుడిగా నియమించింది. తదనంతరం ఏఐసీసీ ఎన్నికల వ్యూహ కమిటీ ఛైర్మన్‌గా కూడా నియమితులైన ఆయన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యూహకర్తగా పనిచేశారు. గత మే నెలలో జరిగిన ఆ రాష్ట్ర ఎన్నికల్లో తన రాజకీయ వ్యూహ చతురతతో అధికారంలో ఉన్న భాజపాను ఓడించి.. ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేలా కృషి చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ప్రధాన సలహాదారుగా పేరుపొందిన సునీల్.. భారత్ జోడో యాత్ర ప్రణాళిక బాధ్యతలు తీసుకుని విజయవంతంగా ఆ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

కర్ణాటక తర్వాత తెలంగాణలోనూ తనదైన శైలిలో పనిచేసి కాంగ్రెస్‌ను అధికారం వైపు నడిపించారు. కాంగ్రెస్ కంటే ముందు ఆయన ఏఐడీఎంకే, డీఎంకే పార్టీలకు కూడా వ్యూహకర్తగా పనిచేశారు. తెలంగాణలో వ్యూహాల అమలు, అంతర్గత సర్వేల వంటి విషయాల్లో సునీల్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం కూడా విజయానికి తోడ్పడిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# కూలిన శిక్షణా విమానం.. ఇద్దరు ఎయిర్ ఫోర్స్ పైలెట్లు మృతి!



మెదక్ జిల్లాలో ఓ శిక్షణా విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలెట్లు మృతి చెందారు. తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో ఈ ఘటన జరిగింది. సోమవారం ఉదయం 8:30 గంటలకు భారీ శబ్దం రావడంతో స్థానికులు వెళ్లి చూశారు. అప్పటికే కూలిన విమానంలో మంటలు చెలరేగాయి. మెదక్ జిల్లాలో ఓ శిక్షణా విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలెట్లు మృతి చెందారు. తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో ఈ ఘటన జరిగింది. సోమవారం ఉదయం 8:30 గంటలకు భారీ శబ్దం రావడంతో స్థానికులు వెళ్లి చూశారు. అప్పటికే కూలిన విమానంలో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు కూలిన విమాణంలో ఓ శిక్షకుడు, ట్రైనీ ఉన్నారు. వారిద్దరూ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. మెదక్ జిల్లాలోని ఎయిర్ ఫోర్స్ సెంటర్ నుంచి ట్రైనింగ్ నిమిత్తం గాల్లోకి ఎగిరిన పిలాటియస్ పీసీ 7 ఎంకే శ్రేణి విమానం కొద్ది సేపటికే కూలిపోయింది.

విమానం కూలిపోయిన ఘటనను ఎయిర్‌ఫోర్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com